సంపుటం 12 సంచిక 342 రిజిస్టరు నం. 11 40; స్థాపనము 1930

గోలకొండపత్రిక

7-12-1959 హైద్రాబాదు. సోమవారం

సంపాదకుడు: ఎన్.నరోత్తమరెడ్డిఎం.ఏ

4 పేజీలు 7నయా పైసలు

హరిజనులు ఇండ్లుకట్టిన స్థలాలు ఇకవారివే

న్యూఢిల్లీ, డిసెం 6: హరిజనులు యిండ్లు కట్టుకొన్న స్థలములు వారికే చెందాలని హరిజన సంక్షేమ కేంద్ర సలహా సంఘం నేడిక్కడ సమావేశమైనప్పుడు సిఫార్సు చేసింది. సమావేశానికి అధ్యక్షత వహించిన హోంమంత్రి శ్రీ పంత్ మాట్లాడుతూ, ఢిల్లీలో ఆ అవకాశమున్నదనీ, యిక మిగిలిన రాష్ట్రాలు అలా చేయాలనీ అన్నారు. వృత్తియప్రణాళికలో హరిజనులకు కేటాయించిన మొత్తంలో ఒకవంతు ఆర్థిక పునరుద్ధరణకు, ఒకవంతు విద్యకు, మిగిలినది గృహనిర్మాణ మంచినీటి సరఫరా మున్నగువాటికి వినియోగించాలని సమావేశం కోరింది. హరిజనులకు సీట్ల రిజర్వేషన్ గడువును పెంచినందుకు సలహాసంఘం ప్రభుత్వాన్ని అభినందించినది.

ఉదారంగా విరాళాలివ్వండి

పతాక దినోత్సవం

(డిసెంబరు 7)

మాజీ సైనికులు వారి కుటుంబాల సంక్షేమానికి సాయపడండి.

తిండిగింజల ధరల పెరుగుదలను అరికట్టాలి

కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలకు సికింద్రాబాద్ జిల్లా ప్రజాసోషలిస్టుపార్టీ మహాసభ అభ్యర్థన

హైద్రాబాద్, డిసెం 6

భారత కమ్యూనిస్టుల్ని పంచమాంగ దళంవారని ప్రకటించవలసిందిగా భారత ప్రభుత్వాన్ని కోరుతూ సికింద్రాబాద్ జిల్లా ప్రజా సోషలిస్టుపార్టీ వార్షిక సర్వసభ్య సమావేశంలో నేడొక తీర్మానం ఆమోదించబడింది.

మన కమ్యూనిస్టుల 30 సంవత్సరాల చరిత్రలో వారు అనేకసార్లు మాతృభూమికి ద్రోహం చేశారనీ, ఇండో-చైనా సరిహద్దు వివాదంలో వారి ప్రవర్తన ఘోరంగా ఉందనీ ఆ తీర్మానములో పేర్కొనబడింది.

భారత సరిహద్దులపై దురాక్రమణ జరిపిన చైనాచర్యల్ని ఖండిస్తూ యీ విషయమై భారత ప్రభుత్వం చైనాచర్యల్ని సమర్థించవలసిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

రాష్ట్ర ప్రజాసోషలిస్టుపార్టీ అధ్యక్షుడు శ్రీ ఎస్. బి. గిరి అధ్యక్షత వహించిన యీ సమావేశంలో శ్రీ జి. సి. కొండయ్య, శ్రీ బి.ఎస్. మహాదేవసింగ్ ప్రభృతులు ప్రసంగించారు.

మహాసభ విజయవంతం కావాలని వాంఛిస్తూ శ్రీ అశోకమెహతా, ఎస్. జి. గోరే ప్రభృతులనుండి సందేశాలు వచ్చాయి.

తిండి గింజల ధరల పెరుగుదలను అరికట్టి, సరస ధరలకు వాటిని ప్రజలకు అందజేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్ని కోరుతూ మరో తీర్మానం చేయబడింది.

హైద్రాబాద్, సికింద్రాబాద్ కార్పొరేషన్ల విలీనీకరణ ప్రతిపాదనను మహాసభ వ్యతిరేకించినది.

ప్రజాసోషలిస్టుపార్టీని విడచి వెళ్ళిన వారు తిరిగి సంస్థలోచేరగోరితే ఆహ్వానించగలమని మరో తీర్మానంలో పేర్కొనబడింది.

శ్రీ బి. ఎస్. మహాదేవ్ సింగ్ తాను ఏపార్టీకి చెందని సోషలిస్టునంటూ, ప్రపంచంలోనేడు సోషలిస్టు ఉద్యమం క్లిష్టదశలో పడిందన్నారు. పార్టీలో చేరినవారు తమసేవలకు ప్రతిఫలం కావాలని కోరడమే భారత దేశంలో సోషలిస్టు ఉద్యమం దెబ్బతినడానికి కారణమని ఆయన అన్నారు.

ప్రజా సమస్యలకు సంబంధించిన ఆదర్శమైన ఒక కార్యక్రమాన్ని రూపొందించి దాన్నమలు జరపాలని శ్రీ ఎస్. బి. గిరి సూచించారు.

పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ నూకల సత్యనారాయణమూర్తి అంతకు ముందు ప్రతినిధులకు స్వాగతం చెప్పారు. (పి. టి. ఐ.)

అంకారాకు ఐక్ చేరిక

టర్కీ నాయకులతో సుదీర్ఘ చర్చలు

అంకారా, డిసెం 6

అమెరికా అధ్యక్షుడు ఐసెన్‌హోవర్ తన 11 రాజ్యాల శాంతియాత్రలో నేడు రోం నుండి బయలుదేరి అంకారా చేరుకొన్నారు.

టర్కీ అధ్యక్షుడు కెవెల్ జేయర్ ముందుగా ఐసెన్‌హోవర్‌కు స్వాగతంచెప్పి ఆయనతో కరచాలనం చేశారు.

పశ్చిమదేశాల కూటమిలో ముఖ్య రాజ్యమైన టర్కీ సోవియట్‌కు సన్నిహితంగానూ ఉంటున్నది. ఐసెన్‌హోవర్ నేటిరాత్రి టర్కీ ప్రభుత్వ అధినేతల్ని కలుసుకొని ప్రచ్ఛన్న యుద్ధాన్ని గురించి సుదీర్ఘ చర్చలు జరిపారు.

రోంలో ఐక్‌కు వీడ్కోలు

రోం, డిసెం 6: ఐసెన్‌హోవర్ నేటి ఉదయం విటికన్ నగరంవెళ్ళి పోప్‌తో 25 నిముషాలపాటు సమావేశమైన తరువాత టర్కీకి బయలుదేరారు. ఇటలీ ప్రెసిడెంట్ గ్రోంచి ప్రభృతులు వీడ్కోలిచ్చారు.

ఐసెన్‌హోవర్ ప్రపంచ శాంతిపట్ల కనబరుస్తున్న శ్రద్ధను పోప్ ప్రశంసించారు. ఆయన ఆశీర్వాదానికి ఐసెన్‌హోవర్ హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలిపారు.

యూరప్ అంతటికి పెద్ద ఈతకొలను

మాస్కో, డిసెం 6

యూరప్ అంతటిలోకి పెద్ద ఆరుబయటి ఈతకొలను మాస్కోలో, మాస్కువా నదితీరాన క్రెమ్లిన్ సమీపంలో నిర్మించబడుతూంది.

ఈ కొలను 13000 చదరపు మీటర్ల వైశాల్యమూ, ఒడ్డున 1.1 మీటర్లూ మధ్యన 6మీటర్లూ లోతూ కలిగివుంటుంది. కొలను మధ్యలోడైవింగ్ టవర్ నిర్మించబడుతుంది.

ఈ కొలను ఏడాది పొడవునా వినియోగములో వుంటుంది. ఇందులో ఒకేసారి 2000 మంది యీదగలరు. ఈ కొలనుచుట్టూ 5 హెక్టర్ల ప్రదేశంలో చక్కని పార్కు వేయబడుతుంది.

శ్రీ తె. వి. రంగారెడ్డి 70వ జన్మదినోత్సవం

వచ్చే ఫిబ్రవరిలో ఘనంగా జరపాలని కమిటీ నిర్ణయం

హైద్రాబాద్, డిసెంబర్ 6

తెలంగాణ ప్రముఖ నాయకుడైన రెవిన్యూ మంత్రి శ్రీ కొండా వెంకట రంగారెడ్డి 70వ జన్మదినోత్సవం1960 ఫిబ్రవరిలో ఘనంగా జరుపబడుతుందని జన్మదినోత్సవ కమిటీకి చెందిన శ్రీ పి. హనుమంత రావు, (ఎం. పి., తెలంగాణా ప్రాంతీయ కమిటీ అధ్యక్షుడు శ్రీ కె. అచ్యుతారెడ్డి, (ఎం. ఎల్. ఏ) శ్రీ అజాముద్దీన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ జన్మ దినోత్సవ కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి ఆయనమిత్రులుశ్రేయోభిలాషులు అంతా సహకరిస్తున్నారు. కమిటీ కార్యాలయం మోజంజాహీ మార్కెట్‌లోని అలీ కాటేజిలో నెలకొల్పబడింది.

పేకమీషన్ సిఫార్సులకు వ్యతిరేకంగా సమరం

రైల్వే ఉద్యోగులకు రైల్వేఉద్యోగుల సంఘ నాయకులు గురుస్వామి, అల్వారిస్‌ల విజ్ఞప్తి

మధురై, డిసెం 6

"రెండవ పే కమీషన్ సమర్పించిన అన్యాయమైన నివేదిక వ్యవస్థనే మార్చివేయడానికి" సుదీర్ఘ సమరానికి సిద్ధంగా ఉండాలని అఖిలభారత రైల్వేమన్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు శ్రీ ఎస్. గురుస్వామి, ప్రధాన కార్యదర్శి శ్రీ పీటర్ అల్వారిస్ నేడిక్కడ దక్షిణ రైల్వే ఉద్యోగుల సంఘ వార్షిక సమావేశంలో ప్రసంగిస్తూ అన్నారు.

ఈ కమీషన్ నివేదికవలన రైల్వేలలోని మూడు, నాల్గవ తరగతి ఉద్యోగులకు కొద్దిపాటి ప్రయోజనం కలిగింది. కాని సెలవులు, సౌకర్యాలు తగ్గి పని ఎక్కువయింది.

వివాదాల్ని మధ్యవర్తి పరిష్కారానికి నివేదించాలన్నది ఒక్క పే కమీషన్ నివేదికలోని ముఖ్యాంశమని శ్రీ గురుస్వామి అన్నారు.

రైల్వేల ఆదాయం తగ్గిపోవడంవలన ఏర్పడిన క్లిష్టత, ఉత్పత్తి విషయాలపై జాగరూకతతో ఉండాలని శ్రీ పీటర్ అల్వారిస్ రైల్వే ఉద్యోగులకు విజ్ఞప్తి చేశారు. రైల్వే ఉద్యోగులు ఎదుర్కొంటున్న రెండు విషమ సమస్యలుగా ఆయన వాటిని చిత్రించారు.

78 లక్షలతో 1100 గృహాలు పోలీసులకై నిర్మాణం

మార్చిలోగా పనిపూర్తి

హైద్రాబాద్, డిసెం 6

ఆంధ్రప్రదేశ్‌లో పోలీసు వారికి గృహాల నిర్మాణం నిమిత్తం కేంద్రం రు 50 లక్షల ఋణం, రాష్ట్రప్రభుత్వం మరో 28 లక్షలు ఇచ్చాయి. వీటితో మొత్తం 1100 గృహాలు నిర్మించబడుతాయి. అందు కర్నూలు, కాకినాడల్లో 400 చొప్పున నిర్మించబడగా మిగిలిన 800 హైద్రాబాద్‌లో ఏర్పాటవుతాయి. వీటి నిర్మాణం 1960 మార్చి నాటికి పూర్తి కాగలదు.

ఈ సమాచారాన్ని రాష్ట్ర ఐ. జి. పి. శ్రీ ఎ. కె. నంబియార్ తెలియజేశారు.

కాంగ్రెసులో కొందరు ఎస్.డి.పి. వారి చేరిక

నిజామాబాద్, డిసెం 6

సోషలిస్టు డెమోక్రాటిక్ పార్టీకి చెందిన శ్రీ వి. ఆర్. రెడ్డి తదితరులు కొందరు కాంగ్రెసులో చేరడానికి నిశ్చయించుకున్నట్లు తెలుస్తున్నది.

పోస్టు మాస్టర్ అరెస్టు

జనవరి 16న బొంబాయినుండి పంపిన రు.20 మనియార్డరును స్వాహా చేసిన నేరంపై అయిలాపూర్ పోస్టు మాస్టర్‌ను పోలీసులు అరెస్టుచేశారు.

మరో దొంగ అరెస్టు

హనగర్గ అను గ్రామంలో ఒక దుకాణంలో దొంగతనం చేయడానికి ప్రవేశించిన సందర్భంలో ఎల్లప్ప అను (ఖానాపూర్) దొంగను పోలీసులు పట్టుకున్నారు.

చైనా దురాక్రమణ వ్యతిరేక ప్రదర్శనం

హైద్రాబాద్, డిసెం 6

భారత భూభాగంపై చైనా జరిపిన దురాక్రమణకు వ్యతిరేకంగా హైద్రాబాదు, సికింద్రాబాదు పౌరుల పక్షాన డిసెంబర్ 7వ తేదీ సాయంత్రం 4 గంటలకు సుల్తాన్ బజార్ క్లాక్‌టవర్‌నుండి ఊరేగింపు జరుగగలదు. శాసనసభా సమీపంలో ప్రదర్శనం జరుగుతుంది.

కమ్యూనిస్టు, జనసంఘ కార్యకర్తల కొట్లాట

బైకుల్లా రైల్వేస్టేషన్ సమీపాన

బొంబాయి, డిసెం 6

బైకుల్లా రైల్వేస్టేషన్ సమీపాన గత అర్ధరాత్రి కమ్యూనిస్టులుకొందరు, జనసంఘమువారు కొందరు చేరి పరస్పరం కొంతసేపు రాళ్ళు, బోడాసీసాలు రువ్వుకొన్నారు. ఎవ్వరికీ గాయాలు తగులలేదు.

జనసంఘము వారి బహిరంగ సభ చైనా దురాక్రమణకు నిరసన సూచకముగా ఫలానాసమయానికి జరుగుతుందని కమ్యూనిస్టుపార్టీ కార్యాలయం ఎదురుగా రోడ్డుపైద జనసంఘంవారు వ్రాస్తుండగా యీ వివాదం ప్రారంభమైందట.

ALWAYS USE
SIRSILK
Fabrics
AGENTS
RUNGTA & CO
HYD'BAD • SEC'BAD
8360 — PHONE — 74291

దామోదరనదిడాం దేశానికి అంకితం

ప్రధానినెహ్రూ సమక్షంలో ఆప్రాజెక్టు నిర్మాణంలో పనిచేసిన ఒక సంతాల్ స్త్రీచే

పంచట్ (బీహార్), డిసెం 6

దామోదరలోయ కార్పొరేషన్ యింతవరకూ నిర్మించిన డాంలన్నిటిలోనూ పెద్దదైన దామోదర నదికి పంచట్ కొండపై గల రు. 9 కోట్ల డాం ఆప్రాజెక్టు నిర్మాణంలో పనిచేసిన ఒక సంతాల్ స్త్రీచే ప్రధాని నెహ్రూ సమక్షంలో నేడు దేశానికి అంకితం చేయబడింది.

ఈ డాంకు చేర్చబడిన పవర్ స్టేషన్‌కుకూడ ఆస్త్రీప్రారంభోత్సవంచేసింది. డాం నిర్మాణం చివరిదశలో తమ ప్రాణాల్ని కోల్పోయిన వారికి స్మారక చిహ్నంగా నిర్మించబడిన కట్టడానికి ఒక కార్మికుడు ప్రారంభోత్సవం చేశారు.

ఆసమీప గ్రామాలనుండి వచ్చిచేరిన పెద్ద జన సమూహాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ శ్రీ నెహ్రూ డాంలు యితర పెద్దకట్టడాల నిర్మాణం దేశ సౌభాగ్యానికి కృషిచేయాలనే ప్రజల పట్టుదలకు చిహ్నాలేగాని వేరొకటి కాదన్నారు. భారత ప్రజలు దేశవ్యవస్థను పాతపద్ధతినుండి సౌభాగ్యవంతమైన నూతన వ్యవస్థకు మార్చేప్రయత్నంలో ఉన్నారన్నారు.

ఒక కార్మిక స్త్రీ డాంకు ప్రారంభోత్సవం చేయడం తనకు చాల సంతోషాన్ని కల్గించినదని నెహ్రూ అన్నారు.

ఇక ప్రారంభోత్సవాలు మంత్రులు చేయరాదు

పంచట్(బీహార్), డిసెం 6

ఒక కార్మికుడు సక్రమంగా చేయగల ఒక పనిని చేయమని యికముందు ఏమంత్రినీ అడగరాదని తాను వాంఛిస్తున్నాననీ ప్రధానినెహ్రూ నేడిక్కడ సంతాల్ కార్మిక స్త్రీ ఒకరు డాంకు అంకితోత్సవాన్ని జరిపిన సందర్భంలో అన్నారు.

"ఆప్రాజెక్టులో చమటోడ్చి పనిచేసినకార్మికుడు చేయవలసిన పనులు— ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనోత్సవాలు— చేయమని నన్ను తరచు అడుగుతుంటారు. కాని ఆప్రాజక్టులో పనిచేసిన కార్మికుని యీప్రాజక్టును దేశానికి అంకితం చేయమనిఅడగడంచాలమంచిపని" అన్నారు.

దేశాన్ని ఎన్నికలకు సంసిద్ధం చేశాను

బ్రాడ్‌కాస్టు సందేశంలో దహనాయకే వివరణ

కొలంబో, డిసెం 6

"నేను దేశంలో శాంతి భద్రతల పరిస్థితి నెలకొల్పాను. ప్రజల్లో విశ్వాసాన్ని సాధించాను. అస్థిర వాతావరణములోంచి సుస్థిరతను ఏర్పరచాను. ఇక ప్రజలు ఎట్టికలవరము, విభేదాలు, అవరోధము లేకుండా ఎన్నికల్లో పాల్గొనే స్థితిదేశంలోతెచ్చాను. ప్రజల అభిప్రాయాన్ని కనుగొనకుండా చిరకాలం అధికారంలో ఉండాలని నేను తాపత్రయపడుతున్నట్లు నన్ను విమర్శిస్తున్నారు. శ్రీలంకప్రజలుతమ భవిష్యత్తును తాము నిర్ణయించుకోగలరు. మీఅందరికీ విన్నవించుకొనుచున్నాను. దేశబాధ్యత ఇకనుండే మీ ఇష్టంవచ్చినట్లు ఎన్నికల్లో నిర్ణయించి మాతృదేశ ఇతోధికవైభవానికి ప్రయత్నించండి"అని సిలోన్ ప్రధాని దహనాయకే నిన్న సిలోన్ రేడియోనుండి ఒక బ్రాడ్‌కాస్టు సందేశము ఇచ్చాడు.

ప్రజలకు బండారునాయకే ఇన్నాళ్ళు నాయకుడుగా ఉన్నాడు. మరెవరైనా వారికి నాయకుడుగా ఉండాలంటే ఆయనను ప్రజలెన్నుకోవాలి. ఈఉద్దేశంకూడా పార్లమెంటు రద్దును సిఫార్సు చేయడములో తనకు ఉన్నదని దహనాయకే అన్నాడు.

తనహయాంలో బండారునాయకే హత్యకేసు విచారణ పూర్తి చేయించినట్లు, ఉరితీతను తిరిగి ప్రవేశపెట్టగలిగినట్లు, అత్యవసర పరిస్థితిని తొలగించినట్లు, అక్రమవలసల్ని నిరోధించినట్లు దహనాయకే పేర్కొన్నాడు.

ఐక్ పర్యటన ప్రాధాన్యం

ఎం.సి. చాగ్లా వివరణ

బొంబాయి, డిసెం 6

అమెరికా అధ్యక్షుడు ఐసెన్‌హోవర్ ఇండియా రానున్న సందర్భంగా లండన్‌నుండి నేడిక్కడికి వచ్చిన అమెరికాలోని భారత రాయబారి శ్రీ ఎం.సి. చాగ్లా విలేఖరులతో ముచ్చటిస్తూ ఐసెన్‌హోవర్ ఇండియారాక చాల ధైర్యమైన, రాజనీతితో కూడిన సాహస యాత్ర అన్నారు.

నెహ్రూ, ఐసెన్‌హోవర్ కూడ అంతర్జాతీయ అవగాహనం కావాలనీ, ఉద్రిక్తతలు సడలాలనీ వాంఛిస్తున్నారనీ, ఒకేవిధమైన ఆశయాలుగల వారిద్దరూ దగ్గరకు రావడం ప్రపంచ పరిస్థితికి చాల మేలుచేస్తుందనీ ఆయన అన్నారు. మరేదేశ పర్యటనకంటే తన ఇండియాపర్యటనకు చాలప్రాముఖ్యం ఉందని ఐసెన్‌హోవరే అన్నారన్నారు. భారతదేశం స్వాతంత్ర్యాన్ని పరిరక్షించుకొంటూ ఆర్థికముగా ఎలాపురోగమిస్తున్నదో ఐసెన్‌హోవర్ శ్రద్ధగా గమనిస్తుండటమే దానికి కారణమన్నారు.

యువకులకు సైనిక శిక్షణ

పథకం తయారైనదని కృష్ణమీనన్ వెల్లడి

బొంబాయి, డిసెం 6

రక్షణ మంత్రి శ్రీ వి. కె. కృష్ణమీనన్ నగర కళాశాలలు, పాఠశాలల ఎన్. సి. సి. కేడెట్ల పెరేడ్ సందర్భంగా నేటి సాయింత్రం యిక్కడ ప్రసంగిస్తూ 15-19 సంవత్సరాల మధ్యవయస్సుగల 2న్నర లక్షల మంది బాలురకు సైనిక శిక్షణ గరపే పథకాన్ని భారత ప్రభుత్వం రూపొందించినదన్నారు.

ఏదో కలత వాతావరణంలోగాక, అత్యవసర పరిస్థితి తలెత్తితే దేశాన్ని రక్షించుకొనడానికి ఎక్కువ మంది యువజనుల్ని సిద్ధంచేసే ఆశయంతోనే యీ పథకం రూపొందించబడిందన్నారు.

1962లో ప్రధాన ప్రతిపక్షం కావాలని స్వతంత్ర పార్టీ తాపత్రయం

కలకత్తాలో మాసానీ వెల్లడి

కలకత్తా, డిసెం 6

మద్రాసు, ఆంధ్రప్రదేశ్, ఉత్తర ప్రదేశ్‌లలో తమ పార్టీ మంచి అభివృద్ధి సాధించినట్లు స్వతంత్రపార్టీ నాయకుడు శ్రీ ఎం ఆర్. మాసానీ అన్నారు. ఇందుకు రాజాజీ, రంగాలు చాలా కృషిచేశారనీ యీ పరిస్థితిని బట్టి చూస్తే 1962 ఎన్నికల్లో స్వతంత్ర పార్టీ సమర్థవంతమైన ప్రతి పక్షంగా గెలువగలదన్న నమ్మకం ఏర్పడిందనీ శ్రీ మాసానీ అన్నారు.

కాంగ్రెసువద్దు, కమ్యూనిస్టుపార్టీ వద్దు, ప్రజలకు మరో పార్టీ ఏదైనా కావాలి. అందుకనుగుణంగా స్వతంత్రపార్టీ ఏర్పడింది. అయినా గాంధీజీవంటి గొప్ప వ్యక్తికి వారసత్వంగా కాంగ్రెసు పార్టీ దేశంలో గట్టి పునాదులపై నిలిచి ఉన్నందున దాన్ని గద్దె దింపడం చాల కష్టమే అనికూడా శ్రీ మాసానీ అన్నారు.

ఇండో-పాక్ సమస్యలపై ఐక్‌తో చర్చలు

డిసెంబర్ 8వ తేదీన తాను జరపనున్నట్లు పాకిస్తాన్ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ ప్రకటన

కరాచీ, డిసెం 6

పాకిస్తాన్ అధ్యక్షుడు ఫీల్డ్ మార్షల్ అయూబ్‌ఖాన్ నేడిక్కడ పత్రికా విలేఖరులతో ముచ్చటిస్తూ ఎల్లుండి డిసెంబర్ 8వ తేదీన తాను అమెరికా అధ్యక్షుడు ఐసెన్‌హోవర్‌తో జరిపే చర్చలలో ఇండియా, పాకిస్తాన్ సంబంధాలనూ—ముఖ్యంగా కాశ్మీర్ వివాదాన్నీ—ప్రస్తావిస్తానని అన్నాడు.

రావల్పిండి నుండి ప్రత్యేక విమానంలో యిక్కడికి వచ్చిన అయూబ్‌ఖాన్ పాకిస్తాన్- అఫ్ఘనిస్తాన్ సంబంధాలు, లఫర్‌లోని చైనా దురాక్రమణలు మున్నగు యితర అంశాల్ని కూడ తాను ఐసెన్‌హోవర్‌తో చర్చిస్తానన్నారు.

ఇండో-పాకిస్తాన్ సమస్యల్ని ప్రస్తావిస్తే కరాచీలోనూ న్యూఢిల్లీలోనూ వాటిని గురించి చర్చిస్తానని ఐసెన్‌హోవర్ యిటీవల చేసిన ప్రకటనను ప్రస్తావించి "ఇండో-పాక్ ప్రశ్నల్ని, మన యితర సమస్యలన్నిటినీ నేను ఆయనతో ప్రస్తావిస్తాను" అని అయూబ్‌ఖాన్ అన్నాడు.

ఇండియా-పాకిస్తాన్ వివాదాల విషయమై వైస్ ప్రెసిడెంట్ ఐసెన్‌హోవర్‌ను రాయబారాలు జరుపమంటారా అని ప్రశ్నించగా తమ ఉద్దేశం అది కాదనీ, మన సమస్యల పరిష్కారానికి సమయం వచ్చిందని ఇండియా అర్థం చేసుకోడానికి మరం ప్రయత్నిస్తున్నట్లు ఆయనకు చెప్పగోరుతున్నానని అన్నాడు.

మన సమస్యల్ని పరిష్కరించుకోవడం అవసరమని ఉభయ పక్షాలూ భావిస్తేగాని రాయబారాలవలన ప్రయోజనం ఉండదన్నాడు.

అడక్ కాశ్మీర్‌లో భాగం గనుక అది వివాద ప్రాంతమేనని ఇండియా అంతర్భాగ మవడం సరికాదనీ అయూబ్‌ఖాన్ అన్నాడు.

తాను ఐసెన్‌హోవర్‌తో జరిపే చర్చల సందర్భంగా విదేశాంగ మంత్రి మంజూర్ కాదిర్ ఆర్థిక మంత్రి షోయిబ్, విదేశాంగ శాఖ కార్యదర్శి ఇక్రాముల్లా కూడ హాజరవుతారని అయూబ్ అన్నాడు.

విద్యార్థుల వ్యక్తిత్వం పెంపొందే మార్గం

నైతిక విద్యను ప్రోత్సహించడమేనని కేంద్ర హోంమంత్రి శ్రీపంత్ వివరణ

న్యూఢిల్లీ, డిసెం 6

కేంద్రహోంమంత్రిశ్రీగోవింద వల్లభపంత్ నేడిక్కడ సనాతన ధర్మ కళాశాలకు శంకుస్థాపనం గావిస్తూ విద్యార్థుల వ్యక్తిత్వం ఏకీకృతంగా అభివృద్ధి చెందడానికి నైతిక విద్యయొక్క ఆవశ్యకతను వివరించారు.

విద్యార్థి వర్గానికి సంబంధించిన అనేక సమస్యలు - ముఖ్యంగా క్రమశిక్షణోల్లంఘన - మన విద్యావిధానంలోని లోపాలవలనే ఉత్పత్తి అయినట్లు తనకనిపిస్తున్నదని శ్రీపంత్ అన్నారు.

విద్య శాస్త్రం, కళలపై నేరాక యువకుల శీలనిర్మాణంపై కూడ శ్రద్ధ వహించాలి. శాస్త్రపురోగమనంవలన మానవుని చేతిలో గొప్ప శక్తి సంపదలు వచ్చిచేరినవి. అయితే ఆధ్యాత్మిక రంగంలోకూడ అదేవిధమైన అభివృద్ధి జరగని కారణంగా శాస్త్రం మానవజాతి వినాశానికే నేడుఎక్కువ దోహదం చేస్తున్నట్లు కనబడుతున్నది. అందువలన యీ అంశాన్ని విద్యావిధానంలో సంబంధంగల వారు గమనించవలసిన సమయం వచ్చింది.

విద్యార్థులు సంకుచిత తత్వాల్ని వర్జించి తామార్జించిన విద్యను సద్వినియోగంచేసుకోవాలని పంత్ విజ్ఞప్తి చేశారు. విద్యయొక్క ప్రధానాశయాలలో ఒకటి యువజనులు వర్గతత్వాల్ని వర్జించేటట్లు తోడ్పడటమే.

అంతకుముందు ఢిల్లీ విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్సలర్ డా॥ వి. కె. ఆర్. వి. రావు మతసంస్థలు పాఠశాలల్ని, కళాశాలల్ని నెలకొల్పడంవలన మతతత్వం పెరుగుతుందనడం సరికాదన్నారు.

త్వరలో తాండూరులో ప్రప్రథమ సహకార సిమెంటు ఫ్యాక్టరీ

హైద్రాబాద్, డిసెంబరు 6

స్థాపించబడిన 15 నెలల్లోనే ఉత్పత్తిని ప్రారంభించగలిగేట్లు తాండూరులో ప్రప్రథమ సహకార సిమెంటు ఫ్యాక్టరీ త్వరలో ఏర్పాటుకానున్నట్లు తెలుస్తున్నది.

ఈఫ్యాక్టరీలో రోజుకు 300టన్నుల సిమెంటు ఉత్పత్తి కాగలదు. 75 లక్షల మూలధనంతో స్థాపించే యీ కంపెనీవాటా విలువ రు.100. క్వారీవర్కర్లు, స్టోన్ వర్కర్లతో కూడిన సభ్యులు ఎన్నుకొనేబోర్డు యీఫ్యాక్టరీని నిర్వహిస్తుంది

ఈ ఫ్యాక్టరీకి అవసరమయ్యే 45 లక్షల విదేశీద్రవ్యంకొరకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.రుమేనియా నుండి యంత్రాలు తెప్పించాలనుకుంటున్నారు.

1959 సెప్టెంబరు 22న నమోదైన యీఫ్యాక్టరీ జర్తు కార్యాలయానికి డిసెంబరు 20న తాండూరులో సహకారమంత్రి ప్రారంభోత్సవం జరుపుతారు.

స్వతంత్ర పార్టీ శాసన సభ్యులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుల సంయుక్త సమావేశం డిసెంబర్ 9వ తేదీ సాయింత్రం 6 గంటలకు హిమాయత్‌నగర్‌లోని రంగా భవన్‌లో జరుగుతుంది రాజాజీ ప్రసంగిస్తారు.

రాజకీయ బాధితులకు కేంద్రం ద్వారా 8 లక్షలు సహాయం

వివిధ రాష్ట్రాలకు గత నాల్గేండ్లుగా హెచ్చించబడిన వివరాలు

న్యూఢిల్లీ, డిసెంబరు 6

1955-56 లో దేశీయాంగ మంత్రి ప్రత్యేక గ్రాంటును యేర్పాటుచేసినదిలగాయితు యింతవరకూ వివిధ రాష్ట్రాలూ, కేంద్ర పాలిత ప్రాంతాలలోని రాజకీయ బాధితులకు రూ. 8 లక్షలకుపైగా ఆర్థిక సహాయంచేశారు.

ఢిల్లీ కేంద్ర పాలిత ప్రాంతంలో రూ. 2.64 లక్షలూ, బొంబాయిలో రూ. 1.11 లక్షలూ, ఉత్తరప్రదేశ్‌లో రూ. 94 వేలూ, మద్రాసులో రూ.71 వేలూ పంపిణీ చేశారు.

లోకసభలో శ్రీ ఝులన్‌సిన్హా అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వకంగా సమాధానం చెబుతూ దేశీయాంగమంత్రి, శ్రీ గోవిందవల్లభ్‌పంత్ పై సమాచారం తెలియజేశారు.

రాజకీయ, సాంఘికరంగాలలోనూ తదితర రంగాలలోనూ దేశానికి సేవ చేసిన వారికి తన వివేచన నుపయోగించి ఆర్థిక సహాయంచేసేందుకు దేశీయాంగమంత్రివద్ద సాలీనా రూ. 3 లక్షలు ఉంచుతున్నారు.

ప్రతిభావంతులయిన పేదవిద్యార్థులు

సాంకేతిక విద్యాభ్యాసంనిమిత్తం స్కాలరు షిప్పులు: 1959-60 నుంచి కొత్త పథకం

న్యూఢిల్లీ, డిసెంబరు 6

నడుస్తున్న ఆర్థికసంవత్సరంలో సాంకేతిక విద్యాభ్యాసం నిమిత్తం ప్రతిభావంతులయిన పేద విద్యార్థులకు 1089 స్కాలరుషిప్పులను మంజూరు చేసే ఉద్దేశ్యంతో కేంద్ర వైజ్ఞానిక పరిశోధనా, సాంస్కృతిక వ్యవహారాల మంత్రిత్వ శాఖ వారు ఒక పథకాన్ని రూపొందించారు. ఈ పథకం వెంటనే అమలు జరుపబడుతుంది.

ప్రతిభావిద్యార్థి వేతనాన్ని ఏడాదిలో 12 నెలల పొడవునా ఇస్తారు. ఇంజనీరింగులోను, సాంకేతిక శాస్త్రంలోను, డిగ్రీ తరగతులలో చదివే విద్యార్థులకు ఇచ్చే స్కాలర్‌షిప్పులువల నెలకు రు. 75. డిప్లొమా తరగతులలో చదివే విద్యార్థులకు ఇచ్చే స్కాలర్ షిప్పు విలువ నెలకు రు. 50. ఈ స్కాలరుషిప్పులు పొందిన విద్యార్థులు ఏవిద్యా సంస్థలలో చదువుతున్నారో ఆ విద్యాసంస్థలను వారివద్దనుండి జీతం కూడా పుచ్చుకోవద్దని కోరడం జరుగుతుంది. ఒకవేళ ఆ సంస్థలు అందుకు అంగీకరించక పోయినట్లయితే, ఆ విద్యార్థులు వెల్లించవలసిన జీతం ఎంతో అంత మొత్తం అధికంగా స్కాలర్‌షిప్పు క్రింద ముట్టజెప్పడం జరుగుతుంది.

అఖిలభారత సాంకేతిక విద్యా మండలి, కేంద్ర విద్యా సలహా సంఘాలు,

(4 వ పేజీ చూడుడు)

దేశరక్షణకై ఐక్యతా శిక్షణ అలవర్చుకోండి

ఎన్. సి. సి. ఏకాదశ వార్షికోత్సవ విన్యాసంలో ముఖ్యమంత్రి ఉద్బోధ

హైద్రాబాద్, డిసెం 6

ఏ విదేశమైనా మనదేశం మీద కన్నువేసి ఉండిన పరిస్థితిలో నిత్యంగా ఉన్న నాలుగు లక్షల సేనానివహమే కాక కోట్లాది భారతీయ పౌరులు దేశరక్షణకు నడుము కట్టగలిగేందుకు వీలుగా ఐకమత్యం పెంపొందించుకోవాలని ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డి యీ ఉదయం సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో జరిగిన ఎన్. సి. సి. ఏకాదశ వార్షికోత్సవ విన్యాసంలో సైనిక వందనం స్వీకరిస్తూ ఉద్బోధించారు. అధిక సంఖ్యలో యువకులు ఎన్. సి. సి. లో చేరి శిక్షణ పొందాల్సిందిగా ఆయన కోరారు.

నేటి యీ పెరేడులో 2300 మంది కాలేజి హైస్కూళ్ళ బాలబాలికలు పాల్గొన్నారు.

యువకులు మరువకూడని భావి భారతదేశ లక్ష్యాలల్ని స్వీకరించాల్సిన వారు కావున ఎక్కువ శక్తితో కృషిచేయడం అలవర్చుకోవాలని శ్రీ సంజీవరెడ్డి కోరారు.

సర్కిల్ కమాండర్ గ్రూప్ కెప్టెన్ కె.సి. వర్మ సందేశాలు చదివారు. ముఖ్యమంత్రికి జేజేలు కొట్టిన అనంతరం జూనియర్ డివిజన్ గ్రూపువారు డ్రిల్లు జరిపారు.

పోలీసు బ్యాండు దళం కూడా పాల్గొన్నది.

గ్రామీణ సహకార రీతులు

(వై. బోరిసోవ్)

సహకారోద్యమం, గ్రామీణ ప్రాంతాలలో సమష్టిక్షేత్రీకరణం గా రూపొంది ఉచ్ఛస్థితి నందుకొనుటలో అనేక దశలను దాటింది; ప్రతిదశలోనూ నాటి దేశపు ఆర్థిక, రాజకీయ పరిస్థితులను బట్టి, రైతుల చైతన్యపుస్థాయినిబట్టి, పట్టణ పల్లె ప్రాంతాల సంబంధాలను బట్టి, విభిన్న వ్యవస్థీకరణ రూపాలను సంతరించుకొంటూ మారుతూ వచ్చింది.

ఈ దశలన్నీ సోవియట్ దేశంలో లెనిన్ రూపొందించిన సహకార ప్రణాళికలో నిర్దేశించబడినవే. గ్రామీణ సహకారోద్యమ వ్యాప్తికీ, సమష్టి కృషికీ ఆధారమైనది ఆప్రణాళికే. చిన్న చిన్న భూఖండాలలో నేర్పం చేస్తున్నందువల్ల రైతులు తీవ్రమైన నష్టకష్టాలను గురియవుతున్నప్పటికీ, ఈ చిన్న చిన్న భూఖండాలన్నింటినీ కలిపి, ఒక్క మాటుగా సమష్టి క్షేత్రాలుగా మార్చివెయ్యలేకపడదన్న అంశాన్ని ఆయన మొట్ట మొదటనే గుర్తించారు. ఈ మార్పును-మామూలుగా కొనసాగించబడుతున్న వస్తుమారకపు, వస్తువుల ఇచ్చి పుచ్చుకోవడాల దశనుంచి క్రమక్రమంగా, అంచలంచలుగా సమష్టి ఉత్పాదన స్థాయికి కొనిపోవలసి వచ్చింది. అందుకని ముఖ్యంగా వ్యవసాయ కృషిలో రైతులకు రకరకాల తోడ్పాటు నిచ్చే సహకార సంఘాలను, ప్రారంభచర్యగా, వరుసవారీగా దేశమంతటా విస్తృత సంఖ్యలో నెలకొల్పవలసి వచ్చింది.

సకలార్థ సాధక సహకార సంఘాలు

గ్రామీణ శ్రామిక ప్రజలు ప్రప్రథమంగా నెలకొల్పినవి సకలార్థ సాధక సహకారసంఘాలు. ఇవి విభిన్నప్రయోజనాలకు ఉద్దేశించబడినవి. రైతులు ఉత్పత్తి చేసిన వ్యవసాయ వస్తు సామగ్రిని ఈసంఘాలే విక్రయించి పెట్టేవి. వివిధమైన ఉత్పాదక పరికరాలను, సాధనలను సమకూర్చి పెడుతూ ప్రాథమిక ఉత్పాదక కార్యకలాప నిర్వహణలో రైతులకు యీసంఘాలు బహుముఖ సహకారాన్ని ఇస్తుండేవి. అన్నిటికంటే ముఖ్యమైంది ఋణసహకారం.

ఈ సహకార సంఘాలు నిలద్రొక్కుకొని, బలపడి, పెంపొందేటప్పటికి ఆసంఘాలు నిర్వహిస్తున్న కార్యకలాపాలనుబట్టి వాటికొక ప్రత్యేకత ఏర్పడ్డది. కృషినిబట్టి అవి వివిధ శాఖలుగా వర్గీకరించ బడ్డాయి. 1920 తొలిరోజులలో వివిధ శాఖలకు చెందిన ఈ సహకార సంఘాలు, సార్వత్రిక కేంద్ర సంఘం, "సెల్స్కాసాయుజ్" నుండి విడిపోసాగాయి. ఆదిలో సరఫరా, మార్కెటింగ్, ఋణ సహకార కార్యకలాపాలు ఈకేంద్ర సంస్థద్వారా నిర్వహించ బడుతుండేవి. ఆతరువాత ఈ ప్రత్యేక సహకార సంఘాలే ఋణాలను, ముఖ్యవస్తుసామగ్రినీ, ఉత్పత్తి సాధనాలను శ్రామిక రైతాంగానికి సమకూర్చి పెట్ట మొదలుపెట్టాయి. రైతులు ఉత్పత్తి చేసిన ధాన్యాదులను ఇవి సమష్టిగా విడుదల చేసి విక్రయించసాగాయి. ఈప్రత్యేక సంఘాలు ఋణసహకార సంఘాలుగా లేక వాణిజ్య సంస్థలుగా వ్యవహరించ సాగాయి. ఈ రెంటిలోనూ రైతుల బహుముఖావశ్యకతలనుబట్టి ఋణ సహకారాన్నిచ్చే, ఋణ సహకార సంఘాలు ప్రజాదరణను చూరగొని విస్తారంగావ్యాప్తికెక్కాయి. వీటిలో రైతులు అత్యధికసంఖ్యలో సభ్యులుగా చేరారు.

ఋణసహకార సంఘాలు

జారు ప్రభువుల కాలపు రష్యాలో ఈఋణ సహకార సంఘాలు గ్రామాలలోని కొద్దిమంది సంపన్నుల అవసరాలకు మాత్రమే వినియోగపడుతుండేవి. ధరావతు లివ్వలేరు కాబట్టి ఋణావశ్యకతవున్న పేద రైతులకు ఆ సంఘాలలో అప్పులు లభించేవేకావు. ఈ ఋణాలాలలో అధికభాగం పలుకుబడులకు, సంపన్నులైన భూస్వాములకే దక్కుతుండేవి. ఈ భూస్వాములు, సంఘాలలో అప్పులనుపొంది, ఆ ముత్తాలలో కొంతభాగం అధిక వడ్డీతో పేద రైతులకు అప్పు పెడుతుండేవారు.

సోవియట్ పరిపాలన ఏర్పడడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఋణ సహకార సంఘాల అభివృద్ధికి ఒక కొత్తదారి ఏర్పడ్డది. సహకార సంఘాలమీద ఇంతకుపూర్వం ఆధిపత్యాన్ని కలిగివున్న బ్యాంకులు కూడా జాతీయం చెయ్యబడడంతో, ఆ బ్యాంకులను తమ గుప్పిటలోపెట్టుకొని అధికారాన్ని చలాయిస్తున్న భూస్వాముల పెత్తనంకూడా తొలగించబడ్డది. ఇతర సహకార సంఘాలన్నింటిలోలాగే ఋణ సహకార సంఘాలలోను పేదరైతుల సభ్యత్వం అత్యధికమై, వాటి సాంఘికస్వరూపంలోనే పెద్ద మార్పు వచ్చింది. అవసరమున్న రైతులకు అతి అప్పులను సకాలంలోఇవ్వడమేగాక, చిన్నచిన్నవ్యవసాయ క్షేత్రాలనుకూడా సహాయపడసాగాయి. అంతేకాదు యీచిన్న చిన్న వ్యవసాయక్షేత్రాలను ప్రత్యేక సౌకర్యాలతో ఆఅప్పు లివ్వబడ్డాయి.

ప్రజా హృదయాన్ని చూరగొని ఈ ఋణ సహకార సంఘాలు విస్తృత వ్యాప్తినందు కొనగలుగుటలో ఆశ్చర్యమేమీలేదు. 1922వసంవత్సరాంతంలో 800 లున్న ఈ ఋణ సహకార సంఘాలు, 1929వ సంవత్సరాంతానికల్లా 10,000లకు పెరిగాయంటే వీటి పురోగతిని అర్థంచేసుకొనవచ్చు. అదేవిధంగా ఈ ఋణసహకార సంఘాల సభ్యత్వం, 1924 నాటి 15 లక్షల కుటుంబాల నుండి 1929కల్లా దాదాపు కోటి కుటుంబాలకు పెరిగింది.

వ్యవస్థలనుబట్టి చూచినా, స్వభావాన్ని తీసుకున్నా యీఋణసహకార సంఘాలను ఒక విశిష్టమైన జాయింట్ స్టాక్ కంపెనీలని చెప్పవచ్చు. ప్రభుత్వ సంస్థల పెట్టుబడులదే యీసంఘాల పెట్టుబడులలో పైచెయ్యిగా ఉండేది. 1927లో ఋణసహకార సంఘాల నిధులన్నింటిలో వున్న ప్రభుత్వ పెట్టుబడులు 60 ప్రతిశత మేరను అధిగమించాయి. డబ్బు వసూళ్లు కావడం, డబ్బు తిరుగుతుండడం సహజంగా ఈ సంఘాలలో మందగతిన నడుస్తుంటుంది కాబట్టి ప్రభుత్వ సహకారం లేకుండా ఆసంస్థలు తమంతట తాముగా నిలద్రొక్కుకొనలేవు.

ఆదిలో యీసంస్థలు, స్టేట్ బ్యాంక్ వ్యవసాయ విభాగాధిపత్యంలో, ఆ బ్యాంకుయొక్క ధనసహకారంతో నిర్వహించబడుతుండేవి. 1923వ సం॥ రాంతంనుండీ కేంద్ర వ్యవసాయ బ్యాంకు, ఈసంఘాలకు ఋణసహకారమివ్వసాగింది. సంఘాలకు కేంద్ర వ్యవసాయ బ్యాంకే ఆధిపత్యంవహించింది. 1931వ సం॥ రారంభానికల్లా వ్యవసాయ సమష్టి క్షేత్రీకరణం ఉద్భవిస్తాయి నందుకొనుటతో, జిల్లా ఋణసహకార సంఘాలు, పిమ్మట, స్టేటుబ్యాంకుజిల్లా శాఖలుగా పునర్వ్యవస్థీకరించబడ్డాయి' ఆతరువాత వ్యవసాయ ప్రయోజనాలకు అప్పులను మంజూరు చేసే అధికారం, యీస్టేటుబ్యాంకు జిల్లాశాఖలకు అప్పగించబడ్డది.

మార్కెటింగ్, సరఫరా సంఘాలు

19 వ శతాబ్దపు మూడవ దశకపు తొలిరోజులలో యీ ఋణ సహకార సంఘాలలాగే మార్కెటింగ్ సరఫరా సహకార సంఘాలు అత్యధిక సంఖ్యలో నెలకొల్పబడ్డాయి. సకలార్థ సహకార సంఘాలలోనుంచే ఇవి రూపొందాయి. శ్రామికులైన రైతు ప్రజలు వీటిలో సభ్యులుగాచేరి మధ్యవర్తులైన వ్యక్తిగత వర్తకుల బారికి గురికాకుండా తప్పుకొనగలిగారు. వ్యక్తిగత లాభ సంపాదనకోసం మధ్యవర్తులు కొనసాగించే దోపిడినుంచి రైతులు ఈ సంఘాలద్వారా విముక్తిని సాధించుకొన్నారు. సహకార సంఘాలలో తాము పెట్టుబడి పెట్టిన మొత్తాలకు ప్రతిఫలంతో పాటు, రైతులు ప్రతియేటా అదనపు లాభాలను, డివిడెండ్లనుకూడా పొందసాగారు.

సహకార సంఘాల అభివృద్ధిలో ప్రముఖ పాత్రను ధరించినది వ్యవసాయ వస్తునేకరణానికి అనుసరించబడిన కాంట్రాక్టులేక ఒప్పంద పద్ధతి. ప్రభుత్వ వస్తునేకరణ సంస్థలు ప్రత్యేకంగా ఆయా శాఖలలో కృషి చేస్తున్న (నార కేంద్ర సంఘం, ధాన్య కేంద్ర సంఘం వంటి) కేంద్ర సంఘాలకు తమకు కావలసిన వస్తు, ధాన్యాదుల కోసం కాంట్రాక్టు పద్ధతిన పెద్దపెద్ద ఆర్డర్లను యిస్తుండేవి. ఈ ఆర్డర్లప్రకారం సరుకును సమకూర్చి యిచ్చే కేంద్ర సంఘాలకు ఆ ప్రభుత్వ సంస్థలు, రైతులకావశ్యకమైన పరికరాలను, ఉత్పత్తి సాధనలను, ముడిసరుకులను అవి సరకుల సరఫరా చేసిన మేరకు సమకూర్చిపెట్టను ముందుగానే హామీ నిచ్చేవి. ఈ ఒప్పందపు పద్ధతే కాంట్రాక్టు పద్ధతిగా వ్యవహారంలోకి వచ్చింది.

ప్రభుత్వ సంస్థల, కేంద్ర సహకార సంఘాలమధ్య పరస్పరాంగీకారంతో జరుపుకొనబడే యీ ఒప్పందాలవల్ల, రైతులకు పారిశ్రామిక వస్తుసామగ్రినీ, కార్మికులకు వ్యవసాయ వస్తుసామగ్రినీ తక్కువ ధరలలో అందజేయవీలయింది. ప్రభుత్వ సంస్థలు, సహకారసంస్థలు సంయుక్తంగా వ్యవహరించినందువల్ల మార్కెటింగ్, సరఫరాలలో మధ్యవర్తులకు స్థానం లేకుండా చెయ్యబడ్డది. పరిశ్రమ, రైతాంగ సహకార సంఘాలమధ్య వస్తువుల యిచ్చిపుచ్చుకోవడాలు, ఉభయత్రా ప్రయోజనాత్మకమైన వస్తుమారక పద్ధతి కొనసాగమొదలైంది. వ్యవసాయ సహకార సంఘాలు, సోషలిస్టు పరిశ్రమలమధ్య సన్నిహిత సజీవ సంబంధం ఏర్పడడంతో గ్రామీణ ప్రాంతాలలోసైతం సహకారోద్యమం దట్టంగా అల్లుకపోవడానికి ఆ సాన్నిహిత్యం ఒక ఆలంబన అయినది.

ఋణ, మార్కెటింగ్, సరఫరా సహకార సంఘాలలో పాల్గొంటూ, యీ అంచలంచల సహకారాన్ని పొందుతూ రైతు, ఉత్పత్తి సాధనలను కైవసం చేసుకొని ఉత్పత్తిని కొనసాగించ సాగాడు. ఉత్పత్తి సాధనల, ముడివస్తు సేకరణకు; వస్తుక్రయవిక్రయాల నిర్వహణకు సహకారసంఘాలు రైతులకు అనల్పంగా తోడ్పడ్డడదువల్ల వ్యక్తిగత కృషికంటే సమష్టి కృషి లాభకరమైన దన్న అభిప్రాయం రైతులలో బలపడ సాగింది. ఉత్పత్తి నంతటినీ సమష్టిగా కొనసాగించే దశ అశ్వటికి కింకా రాలేదు. అయినా మధ్యవర్తులను నిర్మూలించి మార్కెటింగ్, సరఫరా, ఋణసహకార సంఘాలు మధ్యవర్తుల బాధ్యతలను నెరవేర్చే దశను దాటి, వ్యవసాయ సహకారోద్యమాన్ని ఉత్పాదక కార్యకలాపాలను నిర్వహించవలసిన స్థాయికి తీసుకవెళ్లినవి. ఇవి కల్పించిన ప్రోత్సాహ పరివర్తక అనుకూల వాతావరణం, క్రమానుగతికమైన సమష్టి వ్యవసాయ క్షేత్రీకరణానికీ, సమష్టి క్షేత్రీకరణాభివృద్ధికీ హేతుబద్ధమైన ఒక ప్రాతిపదికను సృష్టించింది.

పైన పేర్కొన్న కాంట్రాక్టు పద్ధతిద్వారా సరఫరా మార్కెటింగ్ సహకార సంఘాలను సమష్టి క్షేత్రాలుగా పరివర్తింపజెయ్య వీలయింది. ఆ కాంట్రాక్టులను నిర్వహించే దశలోనే రైతులు కొంతవరకు సమష్టి క్షేత్రీకరణంలోకి అడుగు పెట్టడం జరిగింది. తరచు యీ కాంట్రాక్టులు, కొన్ని వ్యవసాయ క్షేత్రాలతో సమష్టిగా జరుపబడుతుండేవి. వ్యవసాయ వస్తు సేకరణార్థం ప్రవేశపెట్టబడిన యీ కాంట్రాక్టు పద్ధతి, రైతుకుటుంబాలను అత్యధికంగా సంఘటితపరచటానికి ప్రత్యేక సహకార రీతులకంటే విస్తారంగా అనుకూలించింది.

ఉత్పత్తిదారుల సహకార సంఘాలు

20 వ శతాబ్దపు ద్వితీయార్థంలో రైతులు సమష్టి కృషి ఫలితాలను, ప్రయోజనాలను అనుభవపూర్వకంగా గుర్తించ మొదలుపెట్టారు. సమష్టి కృషి ప్రాముఖ్యం నువ్యక్తం కాసాగింది. అప్పటినుంచీ ఉత్పత్తిదారుల సహకార సంఘాలు త్వరగతిన నెలకొనసాగాయి. ఈ సంఘాలు పెంపొంది ప్రాథమిక దశనుదాటి, ఉన్నత రీతులలో త్వరగతినముందుకుచొచ్చుకపోసాగాయి.

ఉత్పత్తిదారుల సహకార సంఘాలు రూపొందిన తరువాత అనుబంధ (సబ్సిడియరీ) ఉత్పత్తిదారీ సహకార సంఘాలు మరొక కోవన నెలకొల్పబడ్డాయి. సమష్టి ఉత్పత్తిలో నిర్వహించవలసిన కొన్ని ప్రాథమిక వ్యవసాయ కార్యకలాపాలు లేక ప్రధాన ప్రక్రియలు రైతుపరంగానే నిర్వహించబడుతూ వచ్చాయి.

ఆతరువాత వ్యవసాయ యంత్రాల కోసం, బీడు భూములనుసాగుకు తీసుకరావడంకోసం, విత్తనాలను కట్టి నారు మళ్ళను పెంచడంకోసం ప్రత్యేక సహకార సంఘాలు నెలకొల్పబడ్డాయి. వీటి ద్వారా మౌలిక వ్యవసాయ కృషికి సంబంధించిన శాఖోపశాఖల కార్యనిర్వహణ సంఘటిత పరచబడ్డది. ఈసంఘాలలో యంత్రాలకు సంబంధించిన సంఘాలు ఎక్కువ ప్రాముఖ్యాన్నిగడించుకొన్నాయి. బీడ, మధ్యరకపు రైతులు తమకు కావలసిన వ్యవసాయ యంత్రాలను సేకరించుకొనడానికి యీసంఘాలలో విరివిగా చేరమొదలుపెట్టారు. రైతులు చేరడం ఎక్కువైనకొద్దీ, ఆ యంత్ర సంఘాల పెట్టుబడులలో ప్రజల ధనం ప్రోగుపడసాగింది. అంటే యంత్రాలమీద కొంతవరకు ప్రజల యాజమాన్యం ఏర్పడ్డదన్నమాట. ఉత్పత్తి సాధనలు వీటివల్ల కొంతవరకు ప్రజాపరం గావించబడ్డాయన్నమాట. ప్రజా సహకారంతో యీయంత్రాలు, సంఘపక్షాన సమష్టిగా, సంయుక్తంగా ఖరీదు చెయ్యబడ్డాయి.

సోవియట్ ప్రభుత్వం యిటువంటి సంఘాల నిర్మితిని అత్యధికంగాప్రోత్సహించింది. ఆసంఘాలకు అనుకూలమైన షరతులమీద ఋణాలు యివ్వబడడమేగాక, వాటికి ప్రత్యేక సౌకర్యాలు, విశేషాధికారాలుకూడా కల్పించబడ్డాయి. ప్రభుత్వ ప్రోత్సాహ, సహకారాలతో ఈవ్యవసాయ యంత్ర సహకార సంఘాలు శీఘ్రగతిన అభివృద్ధి చెందాయి. 1921లో వున్న 30 సంఘాలు, 1929 కల్లా 21,807కు పెరిగాయి.

ఈ యంత్ర సంఘాలలో చేరిన రైతు కుటుంబాలసంఖ్యకూడా ఐదారు రెట్లకు పెరిగింది. వ్యక్తిగత సేద్యం కంటె సాంకేతిక సౌకర్యాలను అత్యధికంగా పొంద వీలు చిక్కడంతో, పంటల విస్తీర్ణాన్ని ఎక్కువచేసి, అధిక పంటలు రాబట్ట బడ్డాయి. రైతుల మనస్సులను ప్రభావితం చేసిన ఈ మహత్తర విజయాలు, శాఖోపశాఖలుగా కొనసాగించబడుతున్న యీసహకార కృషిని ఏకోన్ముఖంగావించి, సమగ్ర వ్యవసాయ సమష్టి క్షేత్రీకరణాన్ని ప్రవేశపెట్టను దోహదం చేశాయి.

1929వ సంవత్సరాంతానికల్లా,వ్యవసాయ కృషి యావత్తూ సమష్టి క్షేత్రీకరణ పద్ధతిద్వారా నిర్వహించబడాలన్న నిశ్చయానికి రావడంతో, రైతులందరూ వ్యక్తిగత వ్యవసాయానికి ఒక్కుమ్మడిగా స్వస్తిచెప్పి పెద్దపెద్ద సమష్టి క్షేత్రాలలో చేరిపోయినారు. వెనుకబడిన వ్యక్తిగత సేద్యపుదశనుండి బృహత్తర సమష్టి క్షేత్రీకరణం అంచలంచలుగా సాధించబడ్డది.

సోవియట్ గ్రామీణ ప్రాంతాలలో సోషలిస్టు పరివర్తనను తీసుకరావడానికి ఒక బలవత్తర సాధన అయింది. ఈవ్యవసాయ సహకారోద్యమం.

టెలీక్లబ్బులూ-టెలివిజనూ

ఢిల్లీలోనూ, ఢిల్లీ చుట్టు ప్రక్కల ప్రాంతాలలోనూ, అన్ని తరగతుల ప్రజలూ, పురుషులూ, స్త్రీలూ, బాలలూ, వారానికి రెండుసార్లు టెలీక్లబ్బులవద్దచేరి టెలివిజను పెట్లపై నాటకాలూ, జానపద నృత్యాలూ, తోలుబొమ్మలాటలూ, చర్చలూ—యీ మొదలైన కొత్త కార్యక్రమాలను చూస్తున్నారు.

టెలివిజనులోతొలిసారిగా ప్రధాన మంత్రి, శ్రీ నెహ్రూ కనిపించడం, టెలీక్లబ్బుల సభ్యులకు ఆయన యిచ్చిన జవాబులూ—యివి ప్రేక్షకులలో టెలివిజనులపట్ల మరింత ఆసక్తిని పెంపొందించాయి.

భారతరాజధానిలో మొత్తంమీద యింతవరకూ 20 టెలిక్లబ్బులు స్థాపింపబడ్డాయి. ప్రతి కేంద్రంలోను ఒక్కొక్క టెలివిజను పెట్టు వుంది. 20 మంది సభ్యులతోకూడిన ఒక కమిటీ వుంది. వీరికితోడు ఒక కేంద్ర నిర్వాహకులున్నారు. టెలివిజను కార్యక్రమాల ఫలితాలను సమీక్షించేందుకు టెలీక్లబ్బుల సభ్యులు చర్చలూ, గోష్ఠులూ జరుపుతుంటారు. టెలివిజను కేంద్రానికి వారు తమ సిఫార్సులుపంపుతారు. ఇప్పుడు గ్రామ ప్రాంతాలలో ఏడు టెలివిజను పెట్లూ, నగరంలోని మురికి పేటలలో మూడుపెట్లూ, ప్రత్యేక ప్రాముఖ్యంగల నగర ప్రాంతాలలో పదిపెట్లూ అంటే, ఇర్విన్ ఆసుపత్రిలో ఒకటీ, బాల్మీకిబస్తీలో అనే హరిజనవాడలో ఒకటీ, ఫిల్మ్స్ శాఖ ప్రదర్శన మందిరంలో ఒకటీ, బాలల చలనచిత్ర సంఘం ఆఫీసు అంటే సర్టిఫికేట్ బోర్డులో ఒకటీ, కమ్యూనిటీ కేంద్రాలలో మిగిలిన ఆరు పెట్లూ వున్నాయి.

కెనడా, ఆస్ట్రేలియా, ఫ్రాన్సు, అమెరికా దేశాలలో పనిచేస్తున్న టెలీక్లబ్బుల పద్ధతిలో భారతదేశంలో కూడా 1959 సెప్టెంబరు 15న తేదీన టెలివిజనుకు ప్రారంభోత్సవం జరపడంతోబాటుగా యీక్లబ్బులను నెలకొల్పారు.

ఇంతవరకూ టెలివిజనుద్వారా 23 కార్యక్రమాలు ప్రదర్శించారు. టెలివిజను కార్యక్రమాలంటే ప్రజల ఆసక్తి రోజురోజుకు పెరుగుతోంది. ఇంకా టెలివిజను పెట్లు కావాలన్న గిరాకీ కూడా హెచ్చుతోంది. అయితేవాటిని తక్షణమే సరఫరా చేయడం అంత సులభమైన పనికాదు.

పిల్లలకేగాక, పెద్దలకు సయితం టెలివిజను కార్యక్రమాలు మంచి వినోదాన్నీ, విజ్ఞానాన్నీ కలిగిస్తున్నాయని టెలీక్లబ్బుల సభ్యుల అభిప్రాయం. టెలివిజనుపై చూపే తోలుబొమ్మలాటలు ఆహ్లాదజనకమైతే, ఆరోగ్య రక్షణా, వ్యాధుల నిర్మూలనలను గురించిన డాక్యుమెంటరీ చిత్రాలు విజ్ఞానదాయకంగానూ, ప్రబోధాత్మకంగానూ వున్నాయి.

జ్యోతిర్వేద సంసత్ ప్రామాణ్యా సేకరణ

మనదేశములో దృగ్గణిత, పూర్వపద్ధతి పంచాంగముల సమస్య ప్రజలను చాల కలవరపెట్టుచున్నది. అట్టి సమస్యను పరిష్కరింపజేసి ప్రజాసౌకర్యమును గలుగజేయుటకు జ్యోతిర్వేద సంసత్తువారు సంకల్పించి యత్నించుచున్నారు. కాన ప్రజాశ్రేయస్సును గోరు సిద్ధాంతులెల్లరును (పంచాంగ కర్తలు) జ్యోతిష్కులును, పండితులును ఈ క్రింద నుదాహరించిన శ్లోకములను బాగుగా సమీక్షించి విషయముల కన్నిటికిని సప్రమాణముగా సమాధానమును తెల్పుచు ఇంకను తమ యొద్దనున్న ఏతద్విషయ ప్రామాణిక శ్లోకములను కార్యాలయమునకు మీ పూర్తి విలాసమునుతోఫిబ్రవరి 1960తేదీలోపుగ పంపగలరని ప్రార్థించుచున్నాను. "ఏవంగ్రహాణాం సర్వేషాం మంద స్ఫుటమితీరితం। చంద్ర సూర్యాస్ఫుటీస్యాతాం మాంధే సైకేన కర్మణా" (గణకానందే). "నక్షత్ర గ్రహయోగేషు గ్రహాస్తోదయసాధనే। శృంగోన్నతౌతు చంద్రస్య దృక్కర్మాణా విదంస్మృతమ్," (సూర్య సిద్ధాంతే). "యంత్రవేధాదినా జ్ఞాతం యద్బీజం గణకైస్తతః। గ్రహణాదిపరీక్షేత నతిథ్యాదికదాచన," (వసిష్ఠ సిద్ధాంతే). "శృంగోన్నతి యుతిచ్ఛాయా గ్రహాస్తోదయసాధనే। బీజేన సంస్కృతాతాఖేటా స్తద్ధీనా స్త్వన్యకర్మణు," (గర్గ మహర్షిః). "గ్రహణ గ్రహోదయాస్త శృంగోన్నతి ఖచరయోగ కాలేషు దృక్సిద్ధోందు స్పాష్ట్యస్పాష్టదేవం సేతరక్రియాను బుధైః," (ఖచరదర్పణే). "దృక్సిద్ధగ్రహచారేణ హోరాఘటమదీరయేత్। సిద్ధాంత గ్రహచారేణ శ్రాద్ధాది సమయం వదేత్," (సిద్ధాంతరహస్యే). "దృక్సిద్ధేందుర్యత్ఖేట గ్రహసాధితాను కుర్వన్తి కేచిత్తిథిషు ప్రమోదాత్। శ్రాద్ధాదికం తత్ప్రితృకాచత స్తేపుణ్యక్షయా ద్దుర్గతి మాప్నువంతి," (స్కందపురాణే). "రవీందు మందసంసిద్ధాత్తత్తిథ్యాది భోగతః। స్యాతాంతత్కాలభోగోత్ధా బాణవృద్ధిరసక్షయా," (తిథినిర్ణయ కారికా). "మాందం కర్మైక మర్కాంశ్చ్యోత్పాదీనా మథోచ్యతే। శైఘ్ర్యం మాందం పునర్మాందం శైఘ్ర్యం చత్వార్యనుక్రమాత్," (సూ.సి.) "తత్తద్గతిపకాన్నిత్యం యథాదృక్తుల్యతాం గ్రహాః। ప్రయాంతి తత్ప్రవక్ష్యామి స్ఫుటీకరణమాదరాత్॥ అదృశ్యరూపాః కాలస్య మూర్తయో భగణాశ్రితాః శీఘ్రమందోచ్చపాతాఖ్యా గ్రహాణాం గతిహేతవః।" (సూ. సి). "తస్మాద్రూపదేశేన రచయే ద్గోలమ త్తమమ్। యుగేయుగే సముచ్ఛిన్నం స్వయమేవవివస్వతః। కాలసంసాధ నార్థాయ తథా యంత్రాణి సాధయేత్। యేకాక్షి యోజయేద్బీజం యంత్రే విస్మయ కారిణి," (సూ. సి). "భచక్రనాభా విషువ ద్వితయం సమసూత్రగం। అయనద్వితయం చైవ చతస్రః ప్రథితాస్తతః," (సూ. సి.). "ఆర్కాద్విని స్సృతః ప్రాచీం యద్యాత్యహరహశ్శశీ। తచ్చాన్దర్గమాన మంశైస్తు జ్ఞేయా ద్వాదశభి స్తిథిః॥" (సూ. సి.). "తిథికరణ ముద్వాహః క్షౌరం సర్వక్రియాస్తథా। వ్రతోపవాస యాత్రాణాం క్రియాచాన్దేణ గృహ్యతే॥" (సూ.సి.). "చంద్రార్కగత్యా కాలస్యపరిచ్ఛేదో యదాభవేత్। తదాతయోః ప్రవక్ష్యామి గతిమాత్రిత్యనిర్ణయమ్। భగణేనసమగ్రేణ జ్ఞేయా ద్వాదశరాశయః। త్రింశాంశశ్చతథారాశేర్భాగ ఇత్యభిధీయతే। ఆదిత్యాద్విప్రకృష్టస్తు భాగద్వాదశకం భవేత్। చంద్రమా స్యాత్తదారామ స్తిథిరిత్యభిధీయతే॥" (విష్ణు ధర్మోత్తరే). "ప్రతిపన్నామ విజ్ఞేయా చంద్రస్యప్రథమా కలా। శుక్లపక్షే విశేచ్చన్ద్రం కృష్ణపక్షే వినిస్సరేత్ ఏవంవిధాయా నిర్ణయత్వం దర్శయితుం తిథిర్విభజ్యతే॥" (కాలమాధవీయే). "ఉపవాస శ్చైకభుక్తం నక్తం చాయాచితంవ్రతం। దానంచ షడ్విధందైవం క్రమాదత్రవివిచ్యతే॥ ఏకోద్దిష్టం పార్వణంచ పిత్ర్యం ద్వివిధ మీర్యతే॥" (కా. మా). "గ్రహనక్షత్ర చరితం జ్ఞాత్వా గోలంచ తత్వతః। గ్రహలోక మవాప్నోతి పర్యాయే ణాత్మవా న్నరః॥" (సూ.సి). "యదా దినద్వయే వ్యపరాహ్ణమస్పృష్ట్వాష్టకం కంచిత్కాలం వ్యాప్నోతి పూర్వ విద్ధైవకర్తవ్యా త్రిముహూర్తాభవేద్యది। కుతపా దథవాప్యర్వాగాసన్నః కుతపోభవేత్॥" (కా. మా). "మధ్యాహ్నాత్రిముహూర్తంతుయదా చరతి భాస్కరః। సకాలః కుతపోనామ పిత్ర్యాణాందత్త మక్షయమ్॥" (నారదః). "ప్రహరాఘటికాన్యూనా ప్రహరాఘటికాధికా। సకాలః కుత పోనామ పిత్ర్యాణాం దత్తమక్షయమ్॥" (మహాభారతే).

సమాధానములు, అభిప్రాయములు, చేరిన తరువాత జ్యోతిర్వేదసంసత్తు వార్షికమహాసభలో పండితులు వానిని పునః పరిశీలించి సమంజసమైన నిర్ణయమును చేయగలరు.

---శ్రీ బి. యం. సూర్యనారాయణశర్మ.

గురజాడ విశ్వమానవుడు

సికింద్రాబాదులో జయంతి సభ

సికింద్రాబాద్, డిసెం 6

మహాకవి గురజాడ అప్పారావు జయంతి సందర్భాన 2 డిసెంబర్, మంగళవారము సాయంకాలము సికింద్రాబాదు కింగ్స్‌వేలోని బూరుగుమహాదేవ్ హాలులో దేశోద్ధారకసమితి సికింద్రాబాద్ అధ్వర్యాన సభకనమావేశము జరిగింది. శ్రీ తాని ధర్మారావు అధ్యక్షతవహించారు. ఈ సందర్భంలో మాట్లాడుతూ గురజాడ వారి కీర్తి రోజురోజుకూ పెరుగుతూంది అని శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి అన్నారు. మహాకవి అన్ని రకాల కవిత్వమూ, కథలూ, వ్యాసాలూ వ్రాసి ఆధునిక కవులకు మార్గదర్శకులు అయ్యారు అన్నారు. భారత కవుల తరువాత తెలుగులో గురజాడఅంత గొప్ప కవి లేరు అన్నారు. అంతా ఒకే విషయాన్ని గురించి నాటకాలు వ్రాస్తున్న రోజుల్లో గురజాడవారు ఒక విశిష్ట వస్తువును తీసుకొని రచన సాగించారు. వారికి మానవునిమీద ఉన్నంత విశ్వాసం ఏ కవికీ లేదన్నారు. 1961 లో వారి శతవార్షిక జయంత్యుత్సవం అత్యుత్సాహంతో జరపాలని కోరారు.

తరువాత శ్రీ డి. రంగాచార్యులు మాట్లాడుతూ, గురుజాడ వైతాళికుడూ, సంస్కర్త, వాగన శాసనుడు, ప్రవక్త అన్నిటికంటె మించి విశ్వమానవుడు అన్నారు. ఆయనవద్ద అవతారపురుషుల్లో ఉండాల్సిన లక్షణాలన్నీ ఉన్నాయన్నారు.

ఆ తరువాత జరిగిన కావ్యగానంలో శ్రీయుతులు దాశరథి, కుందుర్తి, హసజ సి. నారాయణ రెడ్డి సాలోన్నారు. శ్రీ లక్ష్మీకాంత మోహన్ "పూర్ణమ్మ గేయం గానం చేశారు.

అధ్యక్షులు తమ అంత్యోపన్యాసంలో గురజాడను ఎవరు ఏ దృక్పథంలో చూచినా వారికి ఆయన గొప్పవాడుగానే కనిపిస్తాడు అన్నారు.

సమితి కార్యదర్శి శ్రీ వట్టికోట ఆళ్వార్ స్వామి కృతజ్ఞతా సమర్పణతో సమావేశం ముగిసింది.

పోషణేయః పితృణాం దత్తమక్షయమ్॥" (మహాభారతే).

అంతర విశ్వవిద్యాలయ యువజనోత్సవాలు

మైసూరు, డిసెం 6

డిసెంబరు 7 వ తేదీనుండి 16 వ తేదీదాకా మైసూరు విశ్వవిద్యాలయపు అధ్వర్యాన జరుగబోవు అంతర విశ్వవిద్యాలయ యువజనోత్సవాలకు గాను విశ్వవిద్యాలయపు ఆవరణలో ఒక చిన్నపట్టణమే నిర్మాణమై దీనికి "ఏకలవ్యపుర"మని పేరుపెట్టబడింది. విద్యుచ్ఛక్తి, నీటి సరఫరా సౌకర్యాలు, తంతి తపాల టెలిఫోన్ వ్యవస్థలూ కల్పించబడ్డవి. ఈ యువజనోత్సవ నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం ఖర్చుల క్రింద రూ. 3.4 లక్షలు మంజూరుచేసింది. ఇందులో అఖిల భారతంలోని 35 విశ్వవిద్యాలయాలు పాల్గొంటాయి.

మద్రాసు, కాశి, మొదలైన సుమారు 7 విశ్వవిద్యాలయాలు పాల్గొనడంలేదు. మద్రాసువిశ్వవిద్యాలయంవారు యీ ఉత్సవాల్లో విద్యార్థులు పాల్గొనడంవలన కాలహరణం, ద్రవ్య నష్టమనీ భావించినట్టు తెలుస్తూంది.

డిసెంబరు 7 వ తేదీ మైసూరు విద్యామంత్రి శ్రీ అన్నారావు గణముఖ ప్రారంభోత్సవం చేస్తారు. వైస్ ఛాన్సలర్ డా॥ కె. వి. పుట్టప్ప అధ్యక్షత వహిస్తారు. 15వ తేదీ ఇండియా సేనాధిపతి జనరల్ తిమ్మయ్య ఉపన్యసిస్తారు. 16 వ తేదీ కేంద్ర మంత్రి శ్రీ హుమాయూన్ కబీర్ ముగింపు ఉపన్యాసంచేసి బహుమతులు పంచిపెట్టుతారు. డా॥ సి. పి. రామస్వామి అయ్యర్, డా॥ఎ.ఎల్. ముదలియార్ చర్చా గోష్ఠులకు అధ్యక్షత వహిస్తారు. ఉత్సవ సందర్భంలో లలిత కళల ప్రదర్శనం ఉంటుంది.

ఓవల్ మైదానంలో రంగమండపం నిర్మిస్తున్నారు. ఇందులో ప్రతినిధుల సంఖ్యగాక సుమారు వేయి మందికి టికెట్ మూలంగా ప్రవేశం ఉంటుంది. విశ్వవిద్యాలయపు విద్యార్థులకు ప్రవేశ విషయంలో ప్రాముఖ్య

ఆడియో కార్యక్రమం

హైద్రాబాద్-ఎ
405.4 మీ (740 కిలోసై)

8 డిసెంబరు మంగళవారం

ఉ॥ 6-30 సుప్రభాత్ (ఎ.ఠి), 6-35 కార్యక్రమ వివరణ 6-40 భక్తి రంజని, 7-00 తె.వా, 7-15 శిష్టు శ్రీరామశాస్త్రి: వీణ (విజయవాడనుండి రిలే) 7-45 సంగీత శిక్షణ, 8-00 ఆం. వా, 8-15 హిం.వా, 8-30 హిందూస్థానీ సంగీత పాఠం, 8-45 ప్రసార సమాప్తి.

మ॥ 12-30 కార్మికుల కార్యక్రమం కర్మాగారం చూసివద్దాం సి సి గీతి వారంవారం, 1-00 అంబాదాస్ అప్టే, 1-30 వాద్యగోష్ఠి, 1-50 తె.వా, 2-00 వయొలిన్: నిలయవిద్వాంసుడు 2-10 ఉ.వా, 2-20 ఉన్నత పాఠశాలలకు (ఉర్దూ), 2-50 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

3-45 ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రపంచ సాహిత్యం: డాన్ క్విక్సోట్ ప్రసంగం ఎమ్. నరసింహారావు సంస్కృత పాఠము: బి. ఆర్. శాస్త్రి, ఈవారపుకథ, 4-15 ప్రసార సమాప్తి.

సా॥ 6-00 స్థానిక ప్రకటనలు 6-05 ప్రాంతీయ వార్తలు, 6-15 కన్నడ శ్రోతలకు, 7-00 తె.వా, 7-15 మరాఠీ శ్రోతలకు, 7-30 సాహిత్య నందిని సారస్వత కార్యక్రమము (విజయవాడనుండి రిలే), 7-45 శ్రోతల ఉత్తరాలకు జవాబులు 7-50 హిందీకే మునల్మాన్ కవి: రస్‌ఖాన్ ప్రసంగం (హిందీ) వి. రామమూర్తి "రేణు" 8-00 శ్రోతలు కోరిన పాటలు (రి), 8-30 పాఠాల సావిత్రి దేవి, 9-00 ఆం.వా, 9-15 ఉ.వా, 9-30 ఎ. ఐ. ఆర్. వాద్యబృందం (విజయవాడ నుండి రిలే), 10-00 శాస్త్రీయ సంగీత్ (రి), 10-30 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

హైదాబాదు-బి
42.02మీ (7140 కిలోసై)

ఉ॥ 6-30 హైదరాబాద్ ఎవరె 8-45 ప్రసార సమాప్తి.

30.86 మీ (9720 కిలోసై)

మ॥ 12-30 హైదరాబాద్ ఎవరె, 2-10 వయొలిన్: నిలయ విద్వాంసుడు

చెవిటివారికి శుభవార్త!

స్పెక్టకిల్ హియరింగ్ కరెక్టర్ మరియు సైంటిఫిక్ ఫిట్టింగులు

మీ శబ్దగ్రహణ లోపమును అధునాతనమైన స్పెక్టకిల్ ఎయిడ్స్ బి హైండ్ యియర్ ఎయిడ్స్ మరియు యితర ట్రాన్‌సిస్టర్ మోడల్స్‌లోగల వాటి ద్వారా నివారించుకోండి! మా శబ్దగ్రహణ నిపుణుడు శ్రీ కె. ఆర్. రాజగోపాలన్‌ను దిగువ ప్రదేశములలో వాటికెదురుగా చూపబడిన తేదీలలో సంప్రదించండి. మీ శబ్దగ్రహణ లోపమును పరీక్షించుటకు ఆడియోమీటర్ మరియు మీ శబ్దగ్రహణ లోపమునకు తగిన సైపు మరియు డిగ్రీల హియరింగ్ ఎయిడ్స్ వీరివద్ద గలవు.

హన్మకొండ (వరంగల్) ఆనంద్ బాజీ బస్సు స్టాండువద్ద 8, 9, 10 తేదీలు డిసెంబర్ 1959.

హైద్రాబాద్ (ఆం. ప్ర) నిజాం మైసూర్ కేఫ్ బోర్డింగ్ అండ్ లాడ్జింగ్ 11, 12, 13 తేదీలు డిసెంబర్ 1959

మోడరన్ రేడియో కంపెని, మద్రాసు-10.

3వ స్పుత్నిక్ పరిభ్రమణ వివరాలు

మాస్కో, డిసెంబరు 6

సుదూరపు సోవియట్ కృత్రిమ ఉపగ్రహం ప్రయాణించిన దూరం భూమి నుండి సూర్యునికీ, సూర్యునినుండి భూమికీ, ఆ పిమ్మట భూమినుండి కుజ గ్రహానికిగల మొత్తం దూరాన్ని మించుగుంది. ఈ ఉపగ్రహం అప్పుడే సుమారు 36 కోట్ల కిలోమీటర్లదూరం ప్రయాణించింది.

ఈ స్పుత్నిక్‌కు భూమినుండిగల అత్యధికదూరం, రాసిడి మూలంగా ప్రతి పరిభ్రమణకూ సుమారు 120 మీటర్లు తగ్గిపోయింది. రెండవస్పుత్నిక్ యింకా వేగంగా, దాదాపు 450 మీటర్ల చొప్పున తగ్గిపోయింది. 3వ స్పుత్నిక్ బరువులో పెద్దది, వేగం ఎక్కువ.

ప్రాథమిక అంచనాల ప్రకారం 3వ స్పుత్నిక్ అనుకున్న దానికంటె ఎక్కువ కాలమే భూమిచుట్టూ పరిభ్రమిస్తుంది.

3వ స్పుత్నిక్‌తో సాగించిన పరిశోధనలవల్ల భూమి వాతావరణం 2లేక 3వేల కిలో మీటర్ల ఎత్తువరకూ వుంటుందేగాని, యింతకుముందు శాస్త్రజ్ఞులు భావించినట్టుగా వెయ్యి కిలోమీటర్లవరకూ కాదని నిర్ధారణ అయింది.

2-20 సాకాల సావిత్రీదేవి, 2-50 వాతావరణసూచన, ప్రసారసమాప్తి.

3-45 హైదరాబాద్ ఎవరె 4-15 ప్రసార సమాప్తి.

60.14 మీ (4988 కిలోసై)

సా॥ 6-00 హైదరాబాద్ ఎవరె 6-15 గ్రామస్థులకార్యక్రమము, గ్రామస్థుల రేడియోగోష్ఠి: ఉచిత ప్రాథమిక విద్య యక్షగానము ప్రకటనలు, ధరలు వాతావరణము 7-00 తె.వా, 7-15 గ్రామస్థుల కార్యక్రమము, విశేషాలేమిటి? నూతనవ్యవసాయ పరికరాలు సూచనలు, 7-30 హైదరాబాద్ ఎవరె 7-45 శాస్త్రీయ సంగీతం (రి). 8-00 హైదరాబాదు ఎవరె 9-15 శాస్త్రీయ సంగీతం, 9-30 హైదరాబాద్ ఎవరె, 10-30 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

విజయవాడ
357.1మీ (840 కిలోసై)

ఉ॥ 6-30 శుభోదయం, 6-35 ప్రసార విశేషాలు, 6-40 భక్తిరంజని, వి. శ్రీనివాసన్, బృందం, 7-00 తె.వా, 7-15 శిష్టు శ్రీరామశాస్త్రి: వీణ, 7-45 సంగీత శిక్షణ, 8-00 ఆం.వా, 8-15 హిం.వా, 8-30 ప్రసార సమాప్తి.

మ॥ 12-30 కార్మికుల కార్యక్రమము (హైదరాబాద్‌నుండి రిలే). 1-00 పేరంటము స్త్రీలకు-పాటసావిత్రి బాయ్ నాటిక ఇది విన్నారా? మంగళం, 1-30 చల్లపల్లి కృష్ణమూర్తి, 1-50 తె.వా, 2-00 ప్రసార సమాప్తి.

3-30 వేణువు: నిలయవిద్వాంసుడు 3-45 ఉన్నత పాఠశాల విద్యార్థులకు (హైదరాబాద్ నుండి రిలే), 4-15 వాతావరణసూచన, ప్రసార సమాప్తి.

సా॥ 6-00 స్థానిక ప్రకటనలు, 6-05 ప్రాంతీయ వార్తలు, 6-15 గ్రామస్థుల కార్యక్రమము 7-00 తె. వా, 7-15 గ్రామస్థుల కార్యక్రమము, 7-30 సాహిత్యనందిని సారస్వత కార్యక్రమము స్వీయకవిత: దామెర రాజగోపాలరావు, 7-45 పిల్లల పాటలు (ఎ.ఠి), 8 00 శిష్టు శ్రీరామశాస్త్రి: వీణ, 8-30 శ్రోతలు కోరిన పాటలు (రి), 9-00 ఆం.వా, 9-15 అష్టపది (ఎ.ఠి), (గీతగోవిందం నుంచి), 9-30 ఎ. ఐ. ఆర్. వాద్య బృందము, 10-00 చల్లపల్లి కృష్ణమూర్తి, 10-30 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

జిల్లాకు వందమందైనా నిజాయితీ పరులైన కార్యకర్తలు అవసరం

కర్నూలులో శ్రీ సంజీవరెడ్డి ఉద్బోధ

కర్నూలు, డిసెం 5

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి గ్రామములోని పేదతనం పోవాలనే ఉద్దేశంతో పరిపాలనను వికేంద్రీకరించాము అని నిన్నటి రోజున జిల్లా పరిషత్తు ప్రారంభిస్తూ ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డి అన్నారు. జిల్లాబోర్డు కార్యాలయం ముఖ్యమంత్రి శ్రీ సంజీవరెడ్డి విద్యుచ్ఛక్తి "మీటర్"ను వత్తినవెంటనే జిల్లా పరిషత్తు కార్యాలయముగా వెలిగింది.

సభీమణితోసహా ముఖ్యమంత్రి సరాసరి స్వగ్రామం ఇల్లూరునుండి కర్నూలు వచ్చారు సమావేశానికి జిల్లా పరిషత్తు అధ్యక్షుడు శ్రీ కె. విజయభాస్కరరెడ్డి అధ్యక్షత వహించారు. స్వాగత సన్మాన పత్రము సమర్పించబడింది.

జిల్లా కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ మద్దూరు సుబ్బారెడ్డికూడా స్వాగత వినతి పత్రము సమర్పించారు.

జిల్లా కలెక్టరు శ్రీ యం. బి. రాజారావు పంచాయతీ సమితుల జిల్లా పరిషత్తు బాధ్యతలను గురించి విశదంగా వివరించారు. జిల్లా వైశాల్యం 9,216 చ. మైళ్లు, 11 తాలూకాలు, జనాభా 16,18621;888 పంచాయతీలు, అందులో 654 పంచాయతీలు సమితులలోను, 234 పంచాయతీలు పరిషత్తులలోను, 25 మండలాలకు గాను 19 మాత్రం పంచాయతీ సమితులు అందులో డోన్ మాత్రము "ప్రిఎస్‌సెన్సస్ బ్లాకు"గా వున్నదని చెప్పారు. అధికార, అనధికారులు సహకరించి పనిచేయాలన్నారు.

ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డి స్వాగత పత్రాలకు సమాధాన మిచ్చేముందు పరిషత్తు ప్రారంభోత్సవ జ్యోతులు వెలిగించారు.

ముఖ్యమంత్రి ప్రసంగం

ముఖ్యమంత్రి శ్రీ సంజీవరెడ్డి ఇలా ఉపన్యసించారు:

"నేను కర్నూలుకు వచ్చినది జిల్లా పరిషత్తు ప్రారంభోత్సవానికి; కాని కాంగ్రెసువారు కానియ్యండి, పుర ప్రజలు కానివ్వండి పెద్ద సన్మానం చేశారు. అయితే మీరంతా ముఖ్యమంత్రిపదవి వదిలి వెళ్ళుతున్నందులకు సంతోషంతో సన్మానం చేస్తూన్నారా లేదా సానుభూతి చూపుతూ అధ్యక్షుడుగా ఎన్నికైనందులకు గౌరవించారా అనే సందేహం కలిగినది. ముఖ్యమంత్రిగా మూడేళ్ళు చేసినందులకు ఆంధ్రులు చూపిన అనురాగం, ఐక్యతనే ఈ రోజు నేను 14 రాష్ట్రాల ముఖ్యమంత్రులకందరికి చూపవలసిన బాధ్యత వచ్చింది. రాజకీయంగా భేదాభిప్రాయాలు మన రాష్ట్రంలో ఉండినప్పటికికూడా, అభివృద్ధి కార్యక్రమాలలో అందరమూ ఐక్యతతో పనిచేసేవారము. కాని ఇతర బెంగాల్ రాష్ట్ర శాసనసభలలో జరిగినట్లు అల్లరులు ఎన్నడూ జరుగలేదు. మన రాష్ట్రంలోకూడా అప్పుడప్పుడు ఎండకాలంలో వర్షాకాలంలో పుట్టేపార్టీలు లేకపోలేదు. కనితగాదాలురాకుండా తమాషాగా వుండిపోయాము.

భారతదేశంలో ఆంధ్రులంటే ఆవేశపరులని, ఐక్యత వుండదని, ప్రతివారు మహా నాయకులేనని గత 30 సంవత్సరాలనుండి వుంటేది. కాని యిప్పుడు మూడేళ్ళనుండి ఆంధ్రులు అతితెలివివంతులని చెలుసుకున్నారు. నేను సామాన్య రైతు కుటుంబంలో జన్మించి కేవలం వాలంటీరుగా నా రాజకీయ జీవితాన్ని ప్రారంభించి నాకంటే పెద్దలు, ధనవంతులు, పెద్ద చదువు, యోగ్యతలు కలిగిన వారున్నప్పటికి తమ ప్రతినిధిగా ఎన్నుకొనినాకు చేదోడు, వాదోడుగావుండి, అన్ని రంగాలలో అభివృద్ధిచెంది అన్ని రాష్ట్రాలకు ఆదర్శ రాష్ట్రంగా వున్నాము. కాని నా ముఖ్య ఉద్దేశమేమంటే ప్రతివారికి తినేందుకు తిండి, ఉద్యోగస్థులకు తమ నిత్యజీవితానికి సరిపోయే వేతనాలు రైతులకు ఆర్థికాభివృద్ధి వుండాలి. కాని నేను మాత్రం మా రైతులపై అధికపన్ను వేసి కాంగ్రెసుపార్టీని, మన్ను; ప్రభుత్వాన్ని విమర్శించినప్పటికి పన్నులు వేశాను. అయితే పన్నులు ఎందుకు ఎక్కువ చేసినది ప్రజలు గుర్తించారు. కాబట్టే ప్రణాళికాభివృద్ధికి శ్రమదాన రూపకంగా సంపత్తి దానముగా సహకరించారు.

ఆంధ్రరాష్ట్రం ఆహార విషయంలోను, మరే విషయములోనైనాఅగ్రస్థానం అలంకరించినది. కాని ప్రస్తుతము కాంగ్రెసు కార్యకర్తలలో నిరుత్సాహం ఏర్పడినది. కేవలము పదవుల కోసం పార్టీలలో వుండకూడదు. మంత్రిత్వము ఎల్లప్పుడు వుండదు. ఎవరైతే పదవులకుదూరముగా వుంటారో వారినే పదవులు ఆశిస్తాయి. కాబట్టి ప్రతి జిల్లాలో వందమందైనా కాంగ్రెసు కార్యకర్తలు నిష్పాక్షిక, నీతి, నిజాయితీకలిగి ప్రజాసేవచేస్తే కార్యకర్తల నిరుత్సాహం పోతుంది.

నన్ను అఖిలభారత కాంగ్రెసుఅధ్యక్షుడుగా ఎన్నుకుంటున్నారని తెలిసిన వెంటనే అధైర్యపడ్డాను. కాని ముఖ్యమంత్రి పదవిపోతుందనే భావన మాత్రం నాకులేదు, కాంగ్రెసు సేవకునిగా ఏదైనా శిరసావహిస్తాను. కాని ఆంధ్రుల ఆశీర్వాదముంటే అక్కడకూడా ఆ పదవిని నిష్పాక్షికంగాచేసి ఆంధ్రులపేరు ప్రతిష్ఠలు నిలబెట్టగలను.

అధికారులు, అనధికారులనే భావన పోవాలి. ఉద్యోగస్థులు దేశాభిమానంతో పనిచేస్తే పంచాయతీ సమితులలక్ష్యం నెరవేరుతుంది. యింక నేను వచ్చేనెలనుండి ముఖ్యమంత్రిగాక కాంగ్రెసు అధ్యక్షుడుగా వుంటాను. తర్వాత జిల్లా పరిషత్తు ఉపాధ్యక్షుడు శ్రీ యం. సుబ్బారెడ్డి వందన సమర్పణ చేశారు. వినోద కార్యక్రమాలు జరిగినవి.

డోన్ గ్రామానికి రాగానే పంచాయతీ అధ్యక్షుడు, పరిషత్తు సభ్యుడు శ్రీ కె. వెంకటశెట్టి, జిల్లా కాంగ్రెసు ఉపాధ్యక్షుడు శ్రీ యం. శేషన్న, పెద్దుర్తిలో శ్రీ రామకృష్ణారెడ్డి స్వాగత మిచ్చారు. ఆ రాత్రే ముఖ్యమంత్రి హైద్రాబాదుకు వెళ్ళారు.

(మా-వి)

"నాట్య విద్యాలయం" ప్రారంభోత్సవం

హైద్రాబాద్, డిసెం 6

ఆంధ్రప్రదేశ్ నాట్య సంఘము, హైద్రాబాదు ప్రాంతీయ సంఘయాజమాన్యాన నిర్వహిస్తున్న "నాట్య విద్యాలయా"న్ని (నాటక శిక్షణ పాఠశాల) ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖా మాత్యులు శ్రీ యస్.బి.పి. పట్టాభి రామారావు ఈ నెల 9 వ తేదీ సా॥ 6-15 గంటలకు హైద్రాబాదు, నారాయణగూడలోని "న్యూ సైన్సు కాలేజీ" భవనంలో ప్రారంభిస్తారు.

ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ అధ్యక్షులు, శాసన సభ్యులు శ్రీ ఆర్. బి. రామకృష్ణరాజు, శాసన సభ్యులు శ్రీ కట్టారు సుబ్బారావు, ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ సంయుక్త కార్యదర్శి పద్మశ్రీ స్థానం నరసింహారావు ఈ సందర్భంలో తమ శుభాశీస్సులందజేస్తారు.

నాట్య విద్యాలయం ప్రారంభోత్సవంతోపాటు ప్రాచీన నాటక పరికరాలు, తోలు, కర్రబొమ్మల ప్రదర్శన యేర్పాటు చేయబడుతుంది దీనిని ఆంధ్రప్రదేశ్ ఆర్థిక శాఖా మాత్యులు శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ప్రారంభిస్తారు.

దొంగ రవాణా నిరోధానికి పోలీసు అధికారుల చర్చలు

నిజామాబాద్, డిసెం 6

హైద్రాబాదు ప్రాంత డి.ఐ.జి.శ్రీ సి. రంగస్వామి అయ్యంగార్ అధ్యక్షతన డిసెంబరు 3 న బొంబాయి-ఆంధ్రప్రదేశ్ పోలీసు అధికారుల సమావేశం జరిగి ఆహార ధాన్యాల దొంగ రవాణా నిరోధాన్ని గూర్చి చర్చలు సాగాయి. దీనికి హాజరైన వారు:

శ్రీ ప్రధాన్ డి.ఐ.జి. పూరంగాబాదు, రోషన్ డి.ఐ.జి. వరంగల్, నాందేడ్, ఉస్మానాబాదు, పర్భని, ఆదిలాబాదు, కరీంనగర్, మెదక్. నిజామాబాదుల డి.ఎస్.పిలు హైద్రాబాదు కర్నూలుంతాళ డి.ఎస్.పి.

చిత్ర సీమ

ఐక్ పర్యటనపై ఈస్ట్‌మన్ కలర్ చిత్రం

భారత ప్రభుత్వ సమాచారప్రసార శాఖకు చెందిన చలన చిత్ర విభాగం వారు భారతదేశంలో అమెరికా అధ్యక్షుడు ఐక్ పర్యటనపై చలన చిత్రం తీస్తారని అధికార ప్రకటన వెల్వడింది.

ఈ చిత్రం ఈస్టుమన్ కలర్‌లో తీస్తారు. ఢిల్లీలోని వివిధ కార్యక్రమాలలో ఐక్ పాల్గొన్న అంశాలు, ఆగ్రా పర్యటన అన్నీ ఇందులో వివరంగా చూపిస్తారు. ఈ ప్రత్యేక చిత్రంకాక మామూలు వార్తాచిత్రాలలోకూడా ఐక్ పర్యటనాంశాలు ఉంటాయి.

మరొక 'సాబూ' గోవింద్ రాజారాస్

"నార్తు-వెస్టు ఫ్రాంటీర్" చిత్రములో బాలరాజకుమారుని పాత్రని నిర్వహించిన గోవింద్ రాజారాస్, ఆ చిత్రంలోకి రావటం చాల విచిత్రముగా జరిగింది. ఆ చిత్రాన్ని నిర్మిస్తున్న రాంక్ ఆర్గనైజేషన్ సంస్థ చిత్రంలో బాల రాజకుమారుని పాత్ర కోసమై ఒక భారతీయ బాలునికొరకు గాలించుతోంది. అతడు చిన్నవాడుగా ఉండాలి. తెలివితేటలు కలిగి, కెన్నెత్ మోర్ లారెన్ బెకాల్ వంటి ఉద్దండుల పక్క భయపడకుండా నటించేవాడుగా ఉండాలి.

లండన్‌లోని భారత హైకమిషన్ కార్యాలయమందు పనిచేస్తున్న శ్రీ రాజారాస్‌ను "టెస్టు" కోసం మీ పెద్ద పిల్లవాడు ప్రకాష్‌ను ఎందుకుతీసుకొని వెళ్ళకూడదు? అని అతని స్నేహితులు అడిగారు. మద్రాసు వాస్తవ్యుడైన శ్రీ రాజారాస్, విషయాన్ని కొంత ఆలోచించి, "టెస్టు" కోసం వెళ్ళుతున్న మరి 40 మంది భారతీయ బాలకులతో తన పెద్ద కుర్రవాడిని కూడ పంపాడు. ఆ తర్వాత రెండవ టెస్టు జరిగింది. అయితే ఈసారి ప్రకాష్ వెంట అతని తమ్ముడైన గోవింద్ కూడ వెళ్ళాడు. ప్రొడ్యూసర్ మార్సెల్ హెల్మాన్, డైరెక్టరు జె.వి. థాంప్సన్ గోవింద్‌ను చూడగానే, ఇతరులను పరీక్షించటం మానివేసి, అతనిని తమ చిత్రములోకి తీసికొన్నారు.

చిలిపి కళ్ళు, చిరునవ్వు మోము గల గోవింద్ రాజారాస్ ఫిల్ములోని పెద్ద పెద్ద తారలందరికీ త్వరలోనే మంచి అభిమాన పాత్రుడయ్యాడు. లారెన్ బెకాల్ అతనిని ఇంకొక సాబూ అని పిలిచేది. కెన్నెత్ మోర్ అతనిని తరచు తన కాళ్ళమీద కూర్చోబెట్టుకొని, ఫిల్ములలో తన మొదటి రోజుల కథలను చెబుతూండేవాడు. గోవింద్ కూడ తన చిన్న నాటి ముచ్చట్లను కెన్నెత్ మోర్‌కు చెప్పేవాడు.

గోవింద్ ఇప్పుడు తిరిగి తాను చదువుకొంటున్న లండన్‌లోని సెంట్ మేరీస్ ప్రయోరీ స్కూలుకు వచ్చాడు. "నార్తు వెస్టు ఫ్రాంటీర్" చిత్రములో తన నటన విశేషాలను తోటి విద్యార్థులకు చెబుతూ వారిని ఆశ్చర్య సముద్రంలో ముంచుతూన్నాడు.

భారతీయ ఫిల్ముల ఎగుమతి : కేస్కార్ వివరణ

భారతీయ ఫిల్ముల ఎగుమతిని ప్రోత్సహించడానికి ఇండియా ప్రభుత్వంతీసుకొన్న వివిధ చర్యలను రేడియో, సమాచార శాఖా మంత్రి, డాక్టర్ బి.వి. కేస్కర్, లోక్‌సభలో తెలియజేశారు.

భారతీయ ఫిల్ములను ప్రదర్శించడానికిగల అవకాశాలను గురించి తెలియ పర్చవలసిందిగా విదేశాలలోని భారత రాయబారి కార్యాలయాలను కోరామని, ఫిల్ములు లభించడాన్ని బట్టి వ్యాపారపరిత్యాగాకుండా భారతీయ చలన చిత్రాలలో ఉత్తమమైన వాటిని విదేశాలలోని మన రాయబారి కార్యాలయం వారు ప్రదర్శిస్తునే వున్నారనీ, ఆయా ప్రాంతాలలో భారతీయ చలన చిత్రాల ప్రదర్శనపట్ల ప్రజల అభిప్రాయాలను తెలియపరచగల గౌరవ విలేఖరులను కొందరిని ఏర్పాటు చేయవలసినదిగా మన రాయబార కార్యాలయాలను కోరామని భారత ప్రభుత్వం ఫిల్ము సెంసరు తయారుచేసిన డాక్యుమెంటరీలను వివిధ ప్రదర్శన శాలలకు అందజేసే విషయమై కొన్ని స్వదేశీ విదేశీ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకున్నారనీకూడా డాక్టర్ బి. వి. కేస్కర్ తెలియజేశారు.

అంతర్జాతీయ చలన చిత్రాలలో ముఖ్యమైన వాటన్నింటికీ మన దేశములో తయారైన చిత్రాలను మన ప్రతినిధి వర్గాలనూ పంపించడం ద్వారా వాటన్లో పాల్గొంటున్నామనీ కూడా ఆయన తెలియజేశారు. వీలైనంతవరకు విదేశాలలో భారతీయ చలన చిత్రాలను ఏర్పాటు చేస్తూనే వున్నామనీ ఇండియా పాల్గొన్న అంతర్జాతీయ ప్రదర్శనాలలోనూ వాణిజ్య సంతలలోనూ కొన్ని ఉత్తమ చిత్రాలు ప్రదర్శించబడుతూనే వున్నాయనీ, ఫిల్ము పరిశ్రమకు సంబంధించిన సావనీర్ ఒకటి తయారు చేయబడుతున్నదనీ దీని ప్రతులు మన రాయబార కార్యాలయాల ద్వారానూ, అంతర్జాతీయ చలన చిత్రాలలోనూ పంచిపెట్టబడగలవనీ, డాక్టర్ కేస్కర్ తెలియజేశారు.

మన ఫిల్ము పరిశ్రమకు సంబంధించిన వివిధ సమస్యలపై నిపుణులను వారిచే వ్యాసాలను మన వాణిజ్య ప్రతినిధి వర్గాల ద్వారా విదేశీ పత్రికలకు పంపించడానికి ఏర్పాట్లు జరిగాయనీ విదేశాలతో చేసుకొన్న సాంస్కృతిక ఒడంబడికలలో ఫిల్ములను మార్చుకోడానికి కూడా అవకాశాలు కల్పించబడ్డాయని ఫిల్ములకు ఉప శీర్షికలను ఏర్పాటు చేయడానికి కావలసిన యంత్రాల దిగుమతికి లైసెన్సులు విదేశాలకు ఎగుమతి చేసే ఫిల్ముల ప్రింటుకు కావలసిన ముడి ఫిల్ము దిగుమతికి లైసెన్సులు యిచ్చామనీ యీ ఏడాది జనవరి నుంచి సెప్టెంబరువరకు భారతీయ ఫిల్ములు 1,23,11,000 రూ. విదేశీ దర్శ్యాన్ని ఆర్జించాయని కూడా తెలియజేశారు.

గుజరాతు జానపద గేయ సంపద డాక్యుమెంటరీ

గుజరాతు జానపద గేయ సంపద అన్న పేరుతో ఫిల్ము శాఖ నిర్మిస్తున్న డాక్యుమెంటరీ చిత్రాలలో రెండవ భాగాన్ని యీ నెల 4 వ తేదీన దేశవ్యాప్తంగావిడుదల చేశారు. ప్రాతఃకాలంలో గానం చేసే ప్రభాత గీతాలూ, నవరాత్రి ఉత్సవ సందర్భంలో గానం చేసే గీతాలూ, శ్రీ కృష్ణపరమాత్ముని స్తోత్రగేయాలూ ఇందులో వున్నాయి.

అంతర్జాతీయ వ్యవసాయ మహాసభ, రేడియో గ్రామీణ గోష్ఠి, రోంలో ప్రపంచ ఆహార, వ్యవసాయ వ్యవస్థ మహాసభ — వీటి తాలూకు దృశ్యాలు గల వార్తాచిత్రం కూడా యీ వారాంతంలో విడుదలైంది. ఢిల్లీ బాలలకు ఆట బొమ్మల పంపకం, కాశ్మీరు చేతి వృత్తులకు నూతన నమూనాలూ — వీటి తాలూకు దృశ్యాలుకూడా అందులోవున్నాయి.

ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ

లోకసభలో వివరణ

న్యూఢిల్లీ, డిసెం 6

ప్రాథమిక పాఠశాలల అధ్యాపకులకు శిక్షణ సౌకర్యాలను దేశవ్యాప్తంగా కల్పించడానికి అమలు జరుగుతున్న పథకం ద్వారా యింత వరకూ సాధించిన అభివృద్ధిని కేంద్ర విద్యామంత్రి డాక్టర్ కే ఎల్. శ్రీమాలి శ్రీ డి.సి. శర్మ మరో నలుగురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు యిచ్చిన సమాధానంలో వివరించారు.

తృతీయ పంచవర్ష ప్రణాళికా కాలం ఆఖరు నాటికి ఉచిత నిర్బంధ విద్యా సౌకర్యాలు కల్పించడానికి "అధ్యాపక శిక్షణ సౌకర్యాల విస్తరణ" కార్యక్రమం క్రింద ఆంధ్రప్రదేశ్, అస్సాం, బీహారు, బొంబాయి, మధ్యప్రదేశ్, ఒరిస్సా, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాలు రాష్ట్రాలలో నిర్వహించతలపెట్టిన పనులకు భారత ప్రభుత్వం పాలక విషయిక ఆమోదం తెలియచేయబడిందని కూడా విద్యామంత్రి చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో 25 అదనపు శిక్షణ విభాగాలను నెలకొల్పడానికి అంగీకరించారనీ ఒక్కొక్క విభాగంలో సాధారణ 50 మంది శిక్షణార్థులనుతీసుకునే ఏర్పాటు వుంటుందనీ ఆయన తెలియజేశారు.

6 వ సంయుక్త వారం!
శ్రీ సారథి స్టూడియోస్ వారి
భాగ్య దేవత



(సారథిస్టుడియో హైద్రాబాద్‌లో తయారుచేయబడినది)
దర్శకుడు:- తాపీచాణక్య.
సంగీతం: వేణు.
తా॥ సావిత్రి, రాజసులోచన, సూర్యకాంతం, జగ్గయ్య. రేలంగి, బాలయ్య.
దీపక్ మహల్
హైద్రాబాద్,
ప్యారడైజ్
(ఏర్ కండిషన్డు) సికింద్రాబాద్.
ఆటల సమయాలు:
6-00, 9-30.
శ్రీనివాస పిక్చర్ ప్యాలెస్
వరంగల్.
నవయుగ విడుదల.
(Trupix)

4 వ దిగ్విజయ వారం!
పద్మినీ పిక్చర్స్ వారి
సెబాష్ పిల్లా!
రాహత్ - హైదరాబాద్
ఆటలు: 6-00, 9-30.
(Trupix) —విజయరిలీజ్

నేడే చూడండి!
విశవ్ ప్రొడక్షన్స్ వారి
పెళ్లిమీదపెళ్లి
నిర్మాత దర్శకుడు బి.విఠల ఆచార్య
సంగీతం రాజన్ & నాగేంద్ర. రచన: జి.కృష్ణమూర్తి
సాగర్ రాజేశ్వర్ మార్కండేయ
హైద్రాబాదు. సికింద్రాబాదు. వరంగల్.
ఆటలు: 6-0 మరియు 9-30 గం॥
(Trupix) ఈస్ట్ ఇండియా విడుదల.

నేటి రాత్రి నేటి రాత్రి
కుటుంబములకు ఉత్తమ వినోదరస చిత్రము
ఎమ్. ఎ. వి. పిక్చర్స్:-
* ఆలుమగలు *
(తెలుగు)
తా॥ జగ్గయ్య, జానకి, గిరిజ, రమణారెడ్డి.
దర్శకత్వం: కృష్ణారావు. సంగీతం: కె. వి. మహాదేవన్. మాటలు, పాటలు: ఆత్రేయ.
ఒకేప్రధాన యం:
కమల్ చిత్రా రామా
హైద్రాబాద్ సికింద్రాబాద్ వరంగల్
ఆటలు: 6-0 మరియు 9-30 గం॥
(Trupix) —ప్రభాత్ పిక్చర్స్ విడుదల.

17 వ సంయుక్త వారము
శ్రీ వేంకటరమణా ఫిల్మ్స్ వారి
బాలనాగమ్మ
తా॥ అంజలి, రాజసులోచన, ఎన్. టి. రామారావు, సూర్యకళ, రేలంగి, ఎస్. వి. రంగారావు.
రీగల్ - హైద్రాబాద్
శ్రీ కృష్ణా టాకీస్ - సూర్యపేట. రమేష్ - నిజామాబాద్.
భారత్ టాకీస్ - కరీంనగర్. ప్రేమ్ టాకీస్ - నల్గొండ.

రివ సంయుక్త వారం!
సాహితి ఆర్టు ప్రొడక్షన్స్
బండరాముడు
(తెలుగు)
సెలక్టు - బొల్లారం. ప్రభాత్ - నిజామాబాదు.
తదుపరిమార్పు: రీగల్ - హైద్రాబాద్. రాపత్ - హైద్రాబాద్
భారత్ - మహబూబ్‌నగర్.
(Nima) పూర్ణ విడుదల



హైద్రాబాద్ పీయుపు

మీ బాధల నివారణకొఱకు

కవిరాజ్ పండిట్ దుర్గాదత్త శర్మ వైద్య వాచస్పతి ని

సంప్రదించండి:

గుండెజబ్బు, నరముల బలహీనత, అజీర్ణవ్యాధులు, నెత్తురు చెడిపోవుట, బోదకాళ్ళు, లుకోడర్మా, ఉబ్బసము, హిస్టీరియా, అతి మూత్ర వ్యాధి మొదలగు దీర్ఘ వ్యాధులనిర్మూలనకు-

హైద్రాబాదునందు ప్రతి నెల 9 వ తేదీ (సా॥ 3-0 నుండి 7-30 గం॥) తాజ్‌మహాల్ హోటల్, కింగ్‌కోఠిరోడ్. (ఫోన్: 5591)

పై సమయముల గమనించి వారి సలహాపొందండి.

నిర్ణీతకాలం తప్పకుండుటకు వీరు విమానములో ప్రయాణము చేయుదురు.

NAVARATNA KALPA Pharmacy, Jullundur City (India)

భారతీయ డిప్రెస్డు తరగతుల లీగ్

నూతన కార్యవర్గం ప్రకటన

న్యూఢిల్లీ, డిసెం 6

భారతీయ డిప్రెస్డు తరగతుల లీగ్ నూతనాధ్యక్షుడు కేంద్ర సమాజాభివృద్ధి శాఖ డిప్యూటీ మంత్రి శ్రీ బి. ఎస్. మూర్తి తన నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అందులో ఉన్నవారు:

కేంద్ర రైల్వేలమంత్రి శ్రీ జగజీవన రామ్, యం.పి. మంత్రి డా॥ సీతారామ్, ఎన్. రాచయ్య, బి బసవలింగప్ప (మైసూరు మంత్రులు), బొంబాయి మంత్రి ఎన్.కె. త్రిపూడ్, మద్రాసుమంత్రి పి. కక్కన్.

ప్రధాన కార్యదర్శులు ఎం. ఆర్. కృష్ణ, కన్నయలాల్ వాల్మీకి, ఆర్. ఎల్. జంగై (ఎం.సి.లు)

హైద్రాబాద్ బాల్ బ్యాడ్మింటన్ సంఘం

హైద్రాబాద్, డిసెంబర్ 6

హైద్రాబాద్ బాల్ బ్యాడ్మింటన్ సంఘ సర్వసభ్యసమావేశం నేడిక్కడ జరిగినప్పుడు శ్రీ ఎన్. నరోత్తమ రెడ్డి (ఎం. సి) అధ్యక్షుడుగా, శ్రీ ఆర్. సి మౌళి, శ్యామా అయంగార్ ఉపాధ్యక్షులుగా, శ్రీ హామీద్ పాషా ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోబడినారు.

సహకార వ్యవసాయం

(వై. బోరిసోవ్)

వ్యక్తిగత వ్యవసాయం కంటే సహకార వ్యవసాయంలో నిశ్చితమైన లాభాలు ఈ న్నాయన్న దాంట్లో ఎటువంటి సందేహమూ ఉండడానికి వీల్లేదు. ఎందువల్లనంటే సహకార వ్యవసాయంలో ఉత్పత్తి సాధనాలను సమర్థవంతంగా, పొదుపుగా వినియోగించుకోడానికి వీలుంటుంది. ఈ పద్ధతి వ్యవసాయంలో ఆధునిక యంత్రాలను ఉత్తమ సాంకేతిక పద్ధతులను ప్రవేశపెట్టడానికి యెక్కువ అవకాశాలు ఉంటాయి. వ్యక్తిగత కమతాల్లో చెల్లాచెదరై ఉండిపోయే మనుష్య శక్తినీ, భౌతిక మూలాధారాలనూ ఒక్కచోటుకు చేర్చుతుంది. వెనుకబడిన వ్యవసాయపద్ధతికి చిహ్నమైన కొయ్యనాగలి స్థానంలో ఆధునిక యంత్రాలను ఉపయోగించడం సాధ్యమవుతుంది. చిన్నవీ, వెనుకబడినవీ అయిన వ్యక్తిగత కమతాలు బాగాఅభివృద్ధి పొందిన పెద్దసమష్టి కమతాలుగా రూపొందడం చారిత్రికావసరం. వైతు విముక్తిని పొందడానికి యిదొక్కటే మార్గం. అలడుస్వతంత్రులై తన్నుక్రుంగదీస్తున్న దారిద్ర్యం నుండీ, వెనుకబాటు తనం నుండీ బయటపడడానికి దీనికిమించిన మార్గం వేరేలేదు.

కాని ఒక ప్రత్యేక మయిన సాంఘిక పరిస్థితుల్లో మాత్రమే రైతాంగం సమష్టి వ్యవసాయ విధానాన్ని సాధించుకోడానికి వీలుంటుంది. అక్టోబరు విప్లవానికి పూర్వం ఉన్న పరిస్థితుల్లో సహకార సంఘాల కార్యకలాపాలు పరిమితమై ఉంటుండేవి, అప్పుల నివ్వడం, వస్తువులను సరఫరా చేయడం, పంటను అమ్మి పెట్టడం వంటి పనులను మాత్రం అప్పటి సహకార సంఘాలు నెరవేరుస్తూ ఉండేవి. సహకార సంఘాలు, అవి అస్తిత్వంలోవున్న ఆర్థిక, సాంఘిక వ్యవస్థలకు సంబంధం లేకుండా వుండజాలవు. ప్రభుత్వాధికారం, పరిశ్రమలు, బ్యాంకులు వాటిపై ఒక ప్రత్యేక ప్రభావాన్ని కలుగజేసి వాటికొక నిశిష్ట రూపాన్నిస్తాయి. కాబట్టి సహకార స్వభావం, అవి అస్తిత్వంలో వున్న సాంఘిక వ్యవస్థపైన ఆధారపడి వుంటుంది.

జారు రాజులనాటి రష్యాలో సహకార సంఘాలు

ఇంతకు పూర్వం తెలియజేయబడినట్లు విప్లవానికి పూర్వపు రష్యాలో గూడా సహకార సంఘాలు ఉంటుండేవి. కాని, నేటి సోషలిస్టు సహకార సంఘాలకూ, అప్పటి సహకార సంఘాలకు పోలిక యేకోశానా కనబడదు అన్ని పెట్టుబడిదారీదేశాల్లో ఉన్నట్టుగానే ఆకాలంనాటి రష్యాలో గూడా వ్యక్తిగత సంస్థలకు భిన్నమయిన పెట్టుబడిదారీ సహకార సంస్థలు ఉంటుండేవి. జవుళి, పంచదార మొదలైన గుత్త వ్యాపార సంస్థలలాంటి వాటితో వాటికి సన్నిహిత సంబంధాలు ఉంటుండేవి. గుత్తవ్యాపార సంస్థలకు ఆ సహకార సంఘాలు వ్యవసాయపు ముడి సరుకులను చేకూర్చి పెడుతుండేవి మార్కెటింగ్ సహకార సంఘాలు నిజానికి రైతులనుండి సరుకులనుకొని గుత్తవ్యాపార సంస్థలకు అమ్మే గుత్తవ్యాపార సంస్థల ఏజన్సీలుగా ఉంటుండేవి. గ్రామీణ ప్రాంతాలకు వ్యవసాయ పనిముట్లు, యెరువులు మొదలయిన వాటిని సరఫరాచేసే సహకార సంఘాలుకూడా పూర్తిగా గుత్తపెట్టుబడి సంస్థలపైన ఆధారపడి వుంటుండేవి. పరపతి సహకార సంఘాలకు సంబంధించినంత వరకూ అవి బ్యాంకులపైన ఆధారపడి ఉంటుండేవి.

గ్రామీణ సహకార సంఘాలు కులక్‌లచేత- గ్రామీణ ప్రాంతపు ధనవంతులచేత- నడపబడుతూ వారి ప్రయోజనాలకే ఉపయోగపడుతూ ఉండేవి. ఆ సహకార సంస్థలు రైతుల ఇబ్బందులను తగ్గించడానికి బదులు, వారు ధనికరైతులపైన మరింత ఎక్కువగా ఆధారపడేట్లు చేస్తుండేవి.

అప్పటి సహకార సంఘాల కూడికను గమనించినట్లయితే వాటి స్వభావం బాగా అర్థమయిపోతుంది. ఉదాహరణకు, వెన్నను తయారుచేసే సహకార సంఘాలలో దాదాపు 60 శాతం సభ్యులు ధనికరైతులే. పేదరైతులకు వాటిలో స్థానం ఉండేదే కాదు.

ఆ నాటి రష్యాలోని గ్రామీణ సహకార సంఘాలలో అధిక భాగం (60—80 శాతం) పరపతి సహకార సంఘాలే. అయినప్పటికీ, ఆస్తినితాకట్టుపెట్టందే అప్పులను యిచ్చేవి కావు. సహజంగానే పేదరైతులు అలా తాకట్టుపెట్టలేక పోయేవారు. అందువల్ల వారికి అప్పులు లభించేవి కావు. ధనికరైతులకే యెక్కువగా అప్పులు దొరికేవి. అలా అప్పుగా తీసుకొన్న మొత్తంలో అధిక భాగాన్ని వారు అక్రమమైనమార్గాలలో ఖర్చుచేస్తుండేవారు. పరపతి సంఘాలనుండి పొందిన అప్పు మొత్తాలను పేదరైతులకు యెక్కువ వడ్డీకి అప్పుగా యిస్తుండేవారు.

కొత్త సహకార సంఘాలు

జారు రాజులనాటి రష్యాలో సహకార సంఘాలు అప్పటి ఆర్థిక, సాంఘిక వ్యవస్థలకు బంధింపబడి ఉండడం వల్ల కొద్దిమంది ధనికరైతుల ప్రయోజనాలకు మాత్రమే ఉపయోగ పడుతూ వుండేవి. కాని శ్రమిక రైతాంగం సహాయంతో కార్మికవర్గం రాజకీయాధికారాన్ని హస్తగతం చేసుకోవడంతో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి ఉత్పత్తి సాధనాలన్నీ ప్రభుత్వ హస్తగతమయ్యాయి. అక్టోబరు విప్లవం, సమాజంయొక్క పునాదిలోనే మార్పును తీసుకొనిరావడం ద్వారా సహకార సంఘాల సాంఘిక స్వభావాన్నే సంపూర్ణంగా మార్చివేసింది. వాటికివి స్వతమయిన అవకాశాలు కల్పింపబడ్డాయి. సమాజంలో వాటి పాత్రకు ప్రాముఖ్యం యివ్వబడింది. వాటి సంపూర్ణాభివృద్ధికి మార్గం యేర్పడింది.

లెనిన్ సహకార పథకం

సహకార సంఘాలప్రాముఖ్యమును, నూతనవ్యవస్థలో అవి నిర్వహించబోతున్న పాత్రనూ లెనిన్ వెంటనే గ్రహించారు. సహకార సంఘాలకు అత్యంత ప్రాముఖ్యమునుయిస్తూ "సహకార సంఘాలద్వారా, కేవలం సహకార సంఘాలద్వారానే" పరిపూర్ణమయిన సోషలిస్టుసమాజం నిర్మింపబడాలని అంటూ వుండేవారు. సోవియటు దేశ వ్యవసాయాభివృద్ధికి మార్గాలేవో, సహకార సంఘాల ద్వారా సోషలిజం నిర్మాణంకోసం శ్రమిక రైతులను సమీకరించడం యెలాగో ఆయన స్పష్టంగా తెలియజేశారు. మార్కెటింగ్ సహకార సంఘాలు, సరఫరా సహకార సంఘములు ముందుగా స్థాపింపబడాలన్నారు. ఆ తర్వాత ఉత్పత్తిదారుల సంఘాలుకూడా నెలకొల్పబడాలని చెప్పారు. లెనిన్ వేసిన సహకార పథకమే సోవియటు వ్యవసాయంలో సహకార కృషికి కార్యక్రమమయింది. కేవలం ఐచ్ఛికంగా రైతులు సమష్టి వ్యవసాయంలోకి సమీకరింప బతేందుకు అది ఉద్దేశింపబడింది.

పరిశ్రమల అభివృద్ధి, అందులోను ముఖ్యంగా భారీ పరిశ్రమల అభివృద్ధి లెనిన్ పథకంలోని ప్రధానాంశం. చిన్నకమతాలకంటే పెద్ద కమతాలే లాభదాయక మయినవని నిరూపించడానికి వీలయిన శక్తివంతమయిన పరిశ్రమలు ఉన్నప్పుడే సమష్టి వ్యవసాయోత్పత్తి పెంపొందడానికి అవకాశాలు యేర్పడతాయని లెనిన్ ఉద్ఘాటించారు.

వ్యవసాయ సహకార సంఘాలకూ, సోషలిస్టు పరిశ్రమలకూ మధ్య సంబంధాలు పెరిగి, పటుతరం కావడం గ్రామీణ ప్రాంతాల్లో పూర్తిగా మారిపోవడానికి బ్రహ్మాండంగా దోహదం చేసింది.

సహకార సంఘాల కూడికలో మార్పు

శ్రమిక ప్రజల చేతుల్లోకి ప్రభుత్వాధికారం వచ్చిన కొత్త పరిస్థితుల్లో సహకార సంఘాలు శ్రమిక రైతులకు లాభదాయకంగా రూపొందాయి. వారి ప్రయోజనాలకు అనుకూలముగా పనిచేయ సాగాయి. సహజంగానే సహకార సంఘాల కూడిక గూడా పూర్తిగా మారిపోయింది. విప్లవానికి పూర్వం, సహకార సంఘ సభ్యుల్లో పేదరైతులు నూటికి యేడుగురయినా వుండేవారు కారు. విప్లవానంతరం పది సంవత్సరాలు గడిచేటప్పటికి సహకార సంఘాల సభ్యత్వంలో పేదరైతుల సంఖ్య దాదాపు 50 శాతానికి పెరిగింది. అదే సమయంలో ధనికరైతుల సభ్యత్వం 60 శాతంనుండి 8 శాతానికి తగ్గిపోయింది. ఈ విధంగా సహకార సంఘములు కొద్దిమంది ధనవంతుల సంస్థలుగా ఉండేపరిస్థితి అంతరించిపోయింది "జనాభాలోని "నిజమైన" అధిక భాగస్థులు, 'నిజంగానే' పాల్గొనేవే" (లెనిన్)సంస్థలుగారూపొందాయి. కొత్త సహకార సంఘముల విశిష్టత యిందులోనే ఉన్నది. సమష్టి కృషివల్ల కొద్దిమంది వ్యక్తులకు గాక, నిజాయితీతో పనిచేసే వారందరికీ లాభం వుంటుంది. చిన్న ఉత్పత్తిదార్లందర్నీ సమీకరించిన సహకార సంఘములు, సోవియటు దేశంలో బహుళ ప్రజాదరణను పొందిన సంఘములుగా రూపొందాయి.

సహకార సంఘములు సోషలిస్టు వ్యవసాయాభివృద్ధికి సోవియటు ప్రభుత్వం చేతిలో శక్తిమంతమయిన సాధనాలుగా తయారయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లోని లక్షలాది చిన్నరైతులను సోషలిజం నిర్మాతలుగా తయారు చేయడానికి అవి తోడ్పడ్డాయి.

రాయలసీమ ఆదిమ వాసుల సమాజం

కర్నూల్, డిసెం 6

రాయలసీమ ఆదిమనివాసుల సమాజ మహాసభ గతనెల 25వ తేదీన ఆత్మకూరులో ఎరుకల సంఘ కార్యాలయములో శ్రీ జి. ఇ. బహదూర్ అధ్యక్షతన సమావేశమై క్రింది తీర్మానములు చేశారు:

రాయలసీమ జిల్లాలలోని ఎరుకల, యానాది, సుగాలి, చెంచు జాతులతో ఒక ప్రత్యేక సంఘమును స్థాపించుటకు ప్రభుత్వంతో సహకరిస్తూ భాగస్వాములుగా కృషిజేయాలి.

ప్రారంభంలో శ్రీ జి. ఇ. బహదూర్, భుక్కా రామనాయక్, దేవనోతు రామనాయక్, సంఘ అభివృద్ధిని గురించి మాట్లాడారు.

తదుపరి నూతన సంవత్సరానికి క్రిందివారిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. అధ్యక్షులు; శ్రీ జి. ఇ. బహదూర్, ఉపాధ్యక్షులు శ్రీ బి. రామనాయక్, టి. చిన్న బయ్యన్న, ప్రధాన కార్యదర్శి శ్రీ దేవనోతు రామనాయక్, కోశాధికారి శ్రీ మషారు నరసింహులు యింకా 18 మంది సభ్యులు.

మున్సిపల్ కంట్రాక్టు కమిటీ

కర్నూలు పురపాలక సంఘ కంట్రాక్టు కమిటీ సభ్యులుగా శ్రీ కె. విఠల్ రావు పేరును శ్రీ జె. శంకరయ్య ప్రతిపాదించగా, శ్రీ నజీర్ అహమ్మద్ బలపరిచారు. అధ్యక్షులు శ్రీ మహబూబ్ అలీఖాన్ ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు ప్రకటించారు. 32 మంది సభ్యులుకాగాను 14 మంది హాజరయినారు.

తర్వాత ప్రతిపక్ష సభ్యులువచ్చి ప్రత్యేక సమావేశానికి తప్పక 17 మంది సభ్యులు హాజరు కావలయునని, 14మందితో "కోరం"లేదనికమీషనర్‌కు ఫిర్యాదుచేశారు. (మా. వి.)

విద్యుచ్ఛక్తిప్రాజెక్టులకు విదేశీ ద్రవ్యమారకం

న్యూఢిల్లీ, డిసెం 6

రాష్ట్రాలలోను, యూనియన్ ప్రాంతంలోను నిర్మించబడుతున్న విద్యుచ్ఛక్తి ప్రాజెక్టులకోసం 19.9 ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు 2294.94 లక్షల రు. ల వరకు విదేశీ ద్రవ్య మారక సౌకర్యం కావలసి వచ్చిందనీ, 1959 అక్టోబరునుంచి 1960 మార్చి వరకూ 2791.76 లక్షలవరకూ కావలసి వస్తుందనీ ఇరిగేషను, విద్యుచ్ఛక్తిశాఖ డిప్యూటీ మంత్రి శ్రీ బైసుక్ లాల్ హాతీ లోక్‌సభలో శ్రీ విద్యాచరణ్ శుక్లా అడిగిన ఒక ప్రశ్నకు ఇచ్చిన లిఖిత పూర్వక సమాధానంలో తెలియజేశారు. తమ తమ ప్రాంతాలలో జరిగే ప్రాజెక్టులకు విదేశీ ద్రవ్యం ఎంతెంత కావాలో రాష్ట్ర ప్రభుత్వాలు తెలియపర్చగలవనీ ఆయా ప్రాజెక్టుల ప్రాధాన్యాన్ని బట్టి ఆయా అభ్యర్థనలను పరిశీలించడం జరుగుతుందనీ చెప్పి రాష్ట్రాల వారీగా వివరాలను శ్రీ హాతీ సభవారికి అందజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 59 ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకూ 592 లక్షలు కావలసి వచ్చిందనీ అక్టోబరు 59 నుంచి మార్చి 60 వరకూ రు.702.91 లక్షల వరకూ కావలసి వస్తుందనీకూడా ఆయన తెలియపరిచారు. 1959-60 వ సంవత్సరంలో ఇంతవరకూ రు. 1527 లక్షల విలువగల విదేశీ ద్రవ్య మారకాన్ని యీ ప్రాజెక్టుల నిర్మాణ నిమిత్తం వివిధ రాష్ట్రాలకు విడుదల చేశామనీ కూడా ఆయన తెలియజేశారు.

సమితి సైనిక దళం

అధిపతిగా మేజర్ జనరల్ పి. ఎస్. గ్యానీ నియామకం

ఐక్యరాజ్యసమితి. డిసెం 6

ఐక్యరాజ్యసమితి అత్యవసర దళం కమాండర్‌గా జనరల్ బర్న్‌స్థానే మేజర్ జనరల్ పి. ఎస్. గ్యానీ (ఇండియా) నియామకాన్ని సమితి సర్వప్రతినిధి సభ ఆమోదించినది. అమెరికా ప్రతినిధి జేమ్స్ ఫిల్డన్ వారిద్దరినీ అభినందిస్తూ ఒక ప్రకటన చేశారు.

మన ప్రజలు పరిపాలనాదక్షులని పరిషత్తులద్వారా ఋజువు కావాలి

--- ఖమ్మంలో ఉద్బోధ

ఖమ్మం, డిసెంబర్ 6

ఖమ్మం జిల్లా పరిషత్ ప్రారంభోత్సవం స్థానిక వర్తకసంఘభవనంలో యీ నెలశ్వ తేదీన కార్మికమంత్రి శ్రీ డి. సంజీవయ్య జరిపారు. సభకు జిల్లా పరిషత్ అధ్యక్షులు శ్రీ జలగం వెంగళరావు అధ్యక్షత వహించారు. (ఈ వార్త లోగడనే ప్రచురించాం. వివరాలు ఇక్కడ ఇస్తున్నాం — సం॥)

జిల్లా కలెక్టర్ సయ్యద్ హుసేన్ అలీ సభా ప్రారంభం జరిపారు. యావదాంధ్ర ప్రదేశ్‌లో మొట్టమొదటిసారిగా, అన్ని జిల్లాల కంటే చిన్న జిల్లా అయిన ఖమ్మం జిల్లా పరిషత్ ఎన్నికలు జరుగడం, శ్రీ జలగం వెంగళరావువంటి సమర్థులైన వారు అధ్యక్ష స్థానాన్ని అలంకరించడం సంతోషదాయకం అని ఆయన అన్నారు. కలెక్టర్ ఛలోక్తిగా చిన్న జిల్లా అయిన ఖమ్మంపరిషత్తుకు మంత్రివర్గంలోని పిన్న వయస్కులు శ్రీ సంజీవయ్య ప్రారంభోత్సవం జరపడం తగి ఉన్నదన్నారు.

దేశ పునర్నిర్మాణ కృషిలో అధికారులు, అనధికారులు అనే ప్రసక్తి లేదనీ అందరూ పరస్పర సమన్వయ దృక్పథంతో సముచితసంప్రదింపులతో అభివృద్ధి పనుల నిర్వహణ జరుపవలసి వుందనీ, అందరూ ప్రజోపయోగం, గ్రామీణాభివృద్ధి లక్ష్యంతో చిత్తశుద్ధిగా పనిచేసినట్లయితే అభివృద్ధితప్పకుండా జరుగడం సంభవమనీ, అధికారుల పక్షంగా అన్నివిధాల సహకారం లభింపజేయగలనని హామీనిస్తున్నాననీ కలెక్టర్ పేర్కొన్నారు.

స్వాతంత్ర్య సంపాదనకు పూర్వం విదేశీయుల్లో, భారతీయులకు పరిపాలనా సామర్థ్యం లేదనే భావం ఒకటి వుండేదనీ, అయితే గత పన్నెండు సంవత్సరాల స్వల్పావధిలో బ్రిటిషర్లు రెండు వందల సంవత్సరాల పరిపాలనలో చేయజాలనిఅభివృద్ధినిమనం సాధించుకోగలిగామనీ,మనమంత్రులూ పరిపాలనా విధానంలో ప్రత్యేక తేజస్సుకు కారణమనీ అట్లాగేపరిషత్ కార్యక్రమం కూడా ఫలవంతం కాగలదనీ ఆయన ఆశించారు.

జిల్లా పరిషత్ సభ్యులు శ్రీ శీలం సిద్దారెడ్డి మాట్లాడుతూ ఖమ్మంజిల్లాకు చెందిన మంత్రి ఎవరూ ప్రస్తుతం లేనప్పటికీ మొదటినుంచీ శ్రీ సంజీవయ్యను మనజిల్లామంత్రిగా భావిస్తూన్నామనీ శ్రీ వెంగళరావు జిల్లా పరిషత్తుకుఅధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడములో సమస్త రాజకీయ పక్షాలు తమ హార్దిక సంతోషసానుభూతుల్ని వ్యక్తం చేస్తూన్నాయనీ పార్టీలమధ్యన వుండే అనైక్యతా విభేదాలు, జిల్లా పరిషత్‌కు అడ్డు రాకూడదనీ ప్రతిపక్ష పార్టీలకు చెందిన సభ్యులు ఇది ముఖ్యంగా గమనించాలనీ అధ్యక్షుని ఎన్నికలో చూపిన ఏకమత్యమే అభివృద్ధి పనుల నిర్వహణలో చూపవలసినదిగా విజ్ఞప్తి చేస్తూన్నానని అన్నారు.

మంత్రి శ్రీ సంజీవయ్య మాట్లాడూ ఆంధ్ర ప్రదేశ్ అంతటికీ ఈ దినం చరిత్రాత్మకమైన దినమన్నారు. ఈనాటి నుంచీ ఒక వినూత్నమైన పంథాలో మనం ముందుకు సాగిపోతూన్నాం. ప్రజా ప్రతినిధులకు ఈనాటినుంచీ పరిపాలనా సంబంధమైన సర్వాధికారాలు దత్తం చేయబడుతూన్నాయి. అందరి సహకారంతో శ్రీ వెంగళరావు తప్పకుండా తదితరజిల్లాలన్నింటికీ ఖమ్మం జిల్లాను మకుట ప్రాయం చెయ్యగలరనే విశ్వాసం వున్నదన్నారు.

ఇంకా పరిషత్ సభ్యులుశ్రీయుతులు కోటపున్నయ్య, సుగ్గల సత్యనారాయణ, శ్రీమతి లక్ష్మీకాంతమ్మ ఎం. ఎల్.ఎ), సుదర్శన్, ఎం. ఎల్. ఏ. యస్. పెద్దన్న. ఎం.ఎల్.ఏ. ప్రసంగించారు.

ఉపాధ్యక్షులు శ్రీకందిమళ్ళ వెంకట్రామారావు కృతజ్ఞతలతో సభ ముగిసింది.

అనంతరము శ్రీసంజీవయ్య జిల్లా పరిషత్ నూతనకార్యాలయ భవనానికి ప్రారంభోత్సవము జరిపారు.

మండల కాంగ్రెసు కార్యాలయ ప్రారంభోత్సవము

శ్రీ సంజీవయ్య ఖమ్మము పట్టణ గాంధీచౌకు మండలకాంగ్రెసుకార్యాలయానికి కూడా ప్రారంభోత్సవము జరిపారు.

జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ శీలం సిద్దారెడ్డి పతాకవందనము జరిపారు. మండల కాంగ్రెసు కార్యదర్శి శ్రీ పెద్దిలక్ష్మీనారాయణ స్వాగతము చెప్పారు.

మున్సిపల్ వైర్మన్ శ్రీ గెల్లా కేశవరావు, మంత్రికీ, కార్యకర్తలకూ స్థానిక మున్సిపల్ వ్యవహారాలు కార్యకర్తలు ఈ సందర్భంగా గమనించవలసిన ముఖ్య విషయాలు వివులంగా తెలిపారు.

సంజీవయ్య ప్రసంగిస్తూ కార్యకర్తల సమైక్యమే కాంగ్రెసు బలమనీ, పెద్దలనబడే వారి ఆశయాదేశాలను మనం గుర్తించి వ్యవహరించవలసి వుంటుందనీ మొత్తంమీద మన కార్యక్రమాలన్నీ ఎన్నికల పరంఅయినవనీ, అందుకని ప్రతి విషయంపట్ల ఐక్యత, సుదృఢత అవసరమనీ అప్పుడే సంస్థ సజీవంగా మనపగలుగుతుందనీ అన్నారు. వ్యక్తిగతంగా ఎవరికైనా నష్టం జరిగినా తద్వారా సంస్థ లాభపడితే అంతేచాలు ననే త్యాగబుద్ధి, పవిత్ర భావం మనలో కలిగినప్పుడే మనం క్షేమంగా వుంటామనీ, అప్పుడే మంచి జరగగలదనీ అన్నారు. శ్రీ సిద్దారెడ్డి, జలగం వెంగళరావులు కూడా ప్రసంగించారు.

కార్యదర్శి శ్రీ కుంచకర్ల భర్త వత్సలరావు కృతజ్ఞతలు తెలిపారు.

(మొదటి పేజీ తరువాయి)

అంచనాల సంఘం మొదలయిన సంస్థలు చేసిన సిఫారుసును పురస్కరించుకుని యీ పథకాన్ని రూపొందించడం జరిగింది. పేద స్థితిలో ఉన్న ప్రతిభావంతులయిన విద్యార్థులు సాంకేతిక విద్యాభ్యాసం చేయడానికి వీలుగా ప్రభుత్వ సహాయం వారికి అందజేయడమే యీ పథకం ఉద్దేశ్యం. సాంకేతిక విద్యాభ్యాసానికి చాలా డబ్బు ఖర్చౌతుంది. అనేక మంది ప్రతిభావంతులయిన విద్యార్థులు డబ్బులేక చదువు చాలించుకుంటున్నారు. ఒక వేళ చదివినా అతికష్టంమీద చదువ గలుగుతున్నారు. విద్యార్థి వేతనాలు ఇస్తున్న సాంకేతిక సంస్థలలో చాలా వాటిల్లో, అందుకు చేసిన ఏర్పాట్లు చాలీచాలకుండా ఉన్నాయి. అందువల్ల కేంద్ర ప్రభుత్వం రూపొందించిన యీపథకం అటువంటివారికి చాలా తోడ్పడుతుంది. సాంకేతిక విద్యాసౌకర్యాలు పెద్ద ఎత్తున అభివృద్ధి అయిన యీ తరుణంలో ప్రతిభావంతులయిన విద్యార్థులు ఆ సౌకర్యాలను వినియోగించుకోడానికి యీ పథకం తోడ్పడుతుంది.

నడుస్తున్న రైలులో బోగీ కప్పుకూలి 4 గురిమృతి

లక్నో, డిసెం 6

ఆగ్నేయ రైల్వేలోని మానిక్‌పూర్- అయోధ్యాఘాట్ బ్రాంచి లైనుమీద ప్రయాణము చేస్తున్న ఒక రైలులోని ఒకబోగీకప్పు కూలిపోయినందున ఆబోగీలో ఉన్న నల్గురు చనిపోయారు, 5 గురు గాయపడ్డారు. అసలా బోగీలో ఇద్దరు మగవారు, ఐదుగురు స్త్రీలు, ఇద్దరు పిల్లలుఉన్నారట.

బోగీకప్పు కూలిపోవడానికి కారణము తెలియరాలేదు. గోండా నుండి రైల్వే అధికారులంతా ప్రమాద స్థలానికి హుటాహుటి వెళ్ళారు.

1958 లో విదేశయాత్రికుల వల్ల 17న్నరకోట్ల ఆదాయం

ఈయాత్రికకార్యక్రమాన్ని ప్రోత్సహించాలంటూ కేంద్రమంత్రి శ్రీ సుబ్బరాయన్ వెల్లడి

న్యూఢిల్లీ, డిసెంబరు 6

భారతదేశానికి వచ్చే విదేశయాత్రికుల పట్ల స్నేహభావాన్నీ, సామరస్య సద్భావాలనూ ప్రదర్శించివారియాత్రికుల్ట ఇబ్బందులూ లేకుండా సుఖంగా పూర్తి అయ్యేటట్లు చేయడం అవసరమని కేంద్రరవాణా కమ్యూనికేషన్స్ మంత్రి డాక్టర్ పి. సుబ్బరాయన్ విదేశ యాత్రికుల పట్ల విశేషాదరాభిమానాలను భారతప్రజలలోరేకెత్తింపజేసి వారికి తోడ్పడేందుకు యాత్రిక వ్యవహారాలశాఖ ప్రారంభించినకొత్త ఉద్యమాన్ని వివరిస్తూ యీమధ్యచేసిన రేడియో ప్రసంగములో ఉద్ఘాటించారు.

అంతర్జాతీయ యాత్రిక కార్యక్రమం భారీ ఎత్తున కొనసాగడంవల్ల రెండు ప్రయోజనాలున్నాయనీ మొదటిది వివిధ దేశాల ప్రజల మధ్య సద్భావ సామరస్యాల పెంపుదలకు తోడ్పడిమనీ, విదేశమారకపు ద్రవ్యం ఆర్జనద్వారా ఆదేశాలకు ఆర్థికంగా లాభం చేకూరగలదనీ, ఉదాహరణకు విదేశ యాత్రికులవల్ల భారతదేశానికి 1958 లో 17.5 కోట్ల రూపాయల విదేశ మారకపు ద్రవ్యం లభించినదనీ ఆయన చెప్పారు.

ఈ ప్రయోజనాలరీత్యా యాత్రిక కార్యక్రమాన్ని అన్ని స్థాయిలలోనూ ప్రోత్సహించాలనీ, భారత దేశంలోని ఆకర్షణలను, ముఖ్య స్థలాలను విదేశ యాత్రికులకు తెలియచెప్పి, మనదేశానికి వచ్చిన విదేశయాత్రికులకు అన్ని సౌకర్యాలూ కలిగించడానికి ప్రభుత్వ సంస్థ పనిచేస్తున్నదనీ, అయితేప్రభుత్వ శాఖలు చేయజాలని ముఖ్యమయిన విషయం ఒకటున్నదనీ, మన దేశానికి వచ్చిన విదేశ యాత్రికులకు అతిథి మర్యాదలు యథోచితంగా చేసి వారికి ఎట్టి లోటూ రాకుండా పరాయిదేశం వచ్చినా ఎట్టియిబ్బందులూ పడలేదన్న భావం వారిలోకలిగించాలనీ, డాక్టర్ సుబ్బరాయన్ పేర్కొన్నారు.

విదేశీయులను మోసగించే పద్ధతి అనేక దేశాలలో వున్నది. అయితే మన దేశంలో అంత విస్తారంగాలేదు. నమ్రత, ఔదార్యాలతో వ్యవహరించడానికి డబ్బు ఏమీ ఖర్చుచేయనవసరం లేదు అయితే అవే విదేశ యాత్రికుడి మనస్సు మీద పనిచేస్తాయి అనిఆయన అన్నారు.

విదేశ యాత్రికుల అవసరాలు ఎక్కువ వుండవు. వాటికి డబ్బు ఖర్చుపెట్టడానికి వాళ్ళు వెనుదీయరు. భారతదేశాన్ని చూచివద్దామని ఎన్నో ఏళ్ళనుంచీకలలుకంటూ ధనముకూడా కూడబెట్టుకుని ఇక్కడికివస్తారు. అందువల్ల వంచనకు గురికావడంసహించరు. పైపెచ్చు అట్టి చర్యలు మన దేశానికి కూడా చెడ్డపేరు తెస్తాయి. యాత్రిక రంగంలో మన దేశం ఇటీవలే ప్రవేశించింది. అందువల్ల విదేశ యాత్రికులను ఎక్కువ మందిని ఆకర్షించి, వారికి యీ దేశంలో తగిన సౌకర్యాలను కల్పించడానికి వెంటనే తగు చర్యలు తీసుకోవాలి అని ఆయన కోరారు.

వాణిజ్యవ్యాపారాలు

మెసర్స్ కల్పసూర్యనారాయణ మర్చంట్ అండ్ కమీషన్ ఏజంట్

ఉస్మాన్‌గంజ్- హైద్రాబాదు

ఫోన్ నెం. 4412

హైద్రాబాద్, డిసెం 5

(పల్లా ఒక్కంటికి 120 శేర్లు

దొడ్డు బియ్యం	53-0-0	54-0-0
నెంబర్లు కొ॥	54-0-0	56-0-0
సాంబర్లు పా॥	75-0-0	80-0-0
కొత్తసాంబర్లు	58-0-0	62-0-
నూకలు	30-0-0	40-0-0
వరంగల్ సాం. పా॥	80-0-0	83-0-0
కందులుపెద్దవి కొ॥	50-0-0	42-0-0
కందులుచిన్నవి కొ॥	38-0-0	42-0-0
మినుములు	48-0-0	51-0-0
సెనగలు	38-0-0	42-0-0
శెల్లం	58-0-0	70-0-0
పెసళ్ళు కొ॥	47-0-0	50-0-0
తెల్లజొన్నలు	52-0-0	58-0-0
పచ్చజొన్నలు	38-0-0	40-0-0
మిరపకాయలు	280-0-0	300-0-0
పసుపు	100-0-0	120-0-0
ఉల్లిగడ్డ	20-0-0	26-0-0
చింతపండు కొ॥	140-0-0	200-0-0
తెల్లనువ్వులు	96-0-0	100-0-0
సజ్జలు	40-0-0	44-0-0
పెద్ద కందిపప్పు	80-0-0	85-0-0
చిన్న కందిపప్పు	70-0-0	72-0-0
సెనగపప్పు	50-0-0	50-8-0
పెసరపప్పు	68-0-0	71-0-0
మినుప పప్పు	69-0-0	71-0-0

రెడ్ టేపిజంపట్ల తిమ్మారెడ్డి విమర్శ

హైద్రాబాద్, డిసెంబరు 6

జపాన్ పర్యటనకు పంపబడిన ఒక ప్రభుత్వాధికారి అక్కడనుండి కొన్ని నమూనాలు తేవడానిక